
https://www.telugudesam.org




# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



వైసీపీ పుట్టుకలోనే శవరాజకీయాలు..

6



స్విమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబు. గంటన్నర పైగా ఆసుపత్రిలోనే ఉండి ప్రతి బాధితుడితో మాట్లాడిన సీఎం.



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి.. బాధ్యతా వైఫల్యంపై అధికారులను నిలదీస్తున్న సీఎం చంద్రబాబు



ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగమేఘాలమీద సంఘటనా ప్రాంతానికి వెళ్లిన మంత్రుల బృందం

# ఘటనపై న్యాయ విచారణ

## నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వేటు


- డీఎస్పీతో పాటు గోశాల డైరెక్టర్ సస్పెన్షన్
- ఎస్పీ, జేఈవో, టీటీడీ సీఎస్‌వోల బదిలీ
- తిరుపతి పరిస్థితి చూసి చలించిపోయిన సీఎం
- భక్తుల మృతి కలిచివేసిందంటూ వ్యాఖ్య
- ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం
- బాధిత కుటుంబాల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం
- తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు
- సాధారణ క్షతగాత్రులకు ప్రత్యేక దర్శనం
- తిరుపతిలో టోకెన్లు ఇస్తున్నారని నాకూ తెలియదు
- ఇకముందు ఎలాంటి దుర్ఘటనా జరగకూడదు
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఘటనా స్థలం పరిశీలన... క్షతగాత్రులకు పరామర్శ



2

*పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో జరిగిన బాధాకరమైన ఘటన నన్ను కలిచివేసింది. భక్తుల మరణ వార్త విని ఎంతో బాధపడ్డా. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకునేలా టీటీడీ అధికారులను ఆదేశిస్తున్నా. తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత వేంకటేశ్వరస్వామి భక్తుడిగా, ముఖ్యమంత్రిగా నాపై ఉంది. తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నా. తిరుమల కొండపై ఇంతటి విషాదం బాధిస్తోంది. తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు విడిచారు. వారి ఆత్మకు శాంతికలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం. మృతుల కుటుంబీకుల్లో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం కల్పిస్తా. క్షతగాత్రులకు వైకుంఠ ఏకాదశి నాడు వేంకటేశ్వర స్వామి దర్శన భాగ్యం కల్పిస్తా. దర్శనం అనంతరం రవాణా ఖర్చులు భరించి ఇంటికి పంపిస్తాను.*

*–చంద్రబాబు నాయుడు*



## ప్రభుత్వం తరపున క్షమాపణ చెబుతున్నా

- సిబ్బంది, పోలీసులు ఉండీ ఘటన దురదృష్టకరం
- మీడియాతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

2



## భూసమస్యలపై బాధితుల గగ్గోలు

- వల్లభనేని అనుచరుడిపై గ్రీవెన్స్‌లో బాధితుడి ఫిర్యాదు
- సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలిచ్చిన బాధితులు

8

## సీఎం దార్శనికతకు నిదర్శనం ఆర్టీజీఎస్



7

6




## ఖరీఫ్ నష్టాలపై కేంద్రానికి నివేదిక

## ప్రతినెలా చేనేత ఎగ్జిబిషన్లు




7

చైతన్యరథం

# ఘటనపై న్యాయ విచారణ

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వేటు
- డీఎస్పీతో పాటు గోశాల డైరెక్టర్ సస్పెన్షన్
- ఎస్పీ, జేఈవో, టీటీడీ సీఎస్వో శ్రీధర్ బదిలీ
- భక్తుల మృతి తనను ఎంతగానో కలిచివేసింది
- ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం
- వారి కుటుంబాల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం
- తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు
- సాధారణ క్షతగాత్రులకు రేపు ప్రత్యేక దర్శనం
- తిరుపతిలో టోకెన్లు ఇస్తున్నారని నాకూ తెలియదు
- ఇకముందు ఎలాంటి దుర్ఘటన జరగకూడదు
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఘటనా స్థలం పరిశీలన... క్షతగాత్రులకు పరామర్శ



తిరుపతి(చైతన్యరథం): పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో జరిగిన బాధాకరమైన ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. భక్తుల మరణ వార్త విని ఎంతో బాధపడ్డా. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకునేలా టీటీడీ అధికారులను ఆదేశిస్తున్నా. తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ఒక వెంకటేశ్వరస్వామి భక్తుడిగా, ముఖ్యమంత్రిగా నాపై ఉంది. తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సంద ర్భంగా బుధవారం జరిగిన తోపులాటలో ఆరుగురు భక్తులు మృతిచెందడంపై ముఖ్య మంత్రి విచారం వ్యక్తం చేశారు. తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని గురువారం నిశితంగా పరిశీలించి దుర్ఘటనపై అక్కడే అధికారులను ప్రశ్నించారు. అనంతరం స్విమ్స్, పద్మావతి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఆసుపత్రుల్లోనే రెండు గంటల పాటు ఉండి గాయపడ్డ వారందరికీ ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టీటీడీ పరిపాలనా భవనంలో ఘటనపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలారావు, మంత్రులు, అధికారులతో సమీక్షించారు.

### ఒక్కో మృతుల కుటుంబానికి రూ.25 లక్షలు

తిరుమల కొండపై ఇంతటి విషాదం ఎంతో బాధిస్తోంది. తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు విడిచారు. లావణ్య(విశాఖ), శాంతి(విశాఖ), నాయుడు బాబు (నర్సీపట్నం), రజనీ(విశాఖ), నిర్మల (కోయంబత్తూర్), మల్లిక(మెట్టు సేలం) భక్తులు మరణించారు. వారి ఆత్మకు శాంతికలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం. మృతుల కుటుంబసభ్యుల్లో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం ఇస్తాము. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడ్డ వారికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాము. చికిత్స పొందేవారికి ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుంది. ఈ ఘటనలో మరో 33 మంది గాయపడ్డారు. వారికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాము. వీరందరికీ వైకుంఠ ఏకాదశి నాడు వెంకటేశ్వర స్వామి దర్శన భాగ్యం కల్పిస్తాం. దర్శనం అనంతరం రవాణా ఖర్చులు భరించి వారిని ఇంటికి చేరుస్తామని తెలిపారు.

### భక్తుల మరణవార్త కలచివేసింది

విశాఖపట్నంలో బుధవారం ప్రధానమంత్రి రూ.2.8 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఆ కార్యక్రమం పూర్తి చేసుకుని ఇంటికి వస్తున్న తరుణంలో ఈ విషాద వార్త విని మనసు కలిచివేసింది. చాలా బాధపడుతున్నాను. వెంకటేశ్వరుని సన్నిధిలో ఎలాంటి అపచారాలు జరగకూడదు. తిరుమల పవిత్రతను నిలబెట్టడం ఒక భక్తుడిగా, ముఖ్యమంత్రిగా నా బాధ్యత. ఈ దివ్యక్షేత్రం పవిత్రతను కాపాడేందుకు కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. మనం చేసిన పనుల వల్ల దేవుని పవిత్రత దెబ్బతినకూడదు. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే. రాజకీయాలకు అతీతంగా కలియుగ దైవమైన వేంకటేశ్వరునికి సేవ చేస్తున్నామని ప్రతిఒక్కరూ అనుకోవాలి. క్రిస్టియన్లు జెరూసలేం, ముస్లింలు మక్కాకు వెళతారు. హిందువులు తిరుమల కొండకు వస్తారు. జీవితంలో ఒక్కసారైనా వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని దర్శించుకోవాలని భక్తులు అనుకుంటారు. వైకుంఠ ఏకాదశి నాడు స్వామి దర్శనం చేసుకుంటే వైకుంఠానికి వెళ్తామని భక్తుల ప్రగాఢ నమ్మకమని పేర్కొన్నారు.

### టోకెన్లు ఇచ్చే సంప్రదాయం గతంలో లేదు

ఎప్పుడూ లేని టోకెన్ల సంప్రదాయాన్ని గతంలో తెచ్చారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పవిత్రమైన రోజులు. వైకుంఠ దర్శనాన్ని 10 రోజులకు ఎందుకు పెంచారో తెలియదు. తిరుపతిలో టోకెన్లు ఇవ్వడంపై భక్తులు ఆగ్రహంగా ఉన్నారు. మొదటి నుంచి ఉన్న సంప్రదాయాలను మార్చడం సరికాదు. ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ పద్ధతులు ఉండాలి. సంప్రదాయాలను ఉల్లంఘించడం సరికాదని అభిప్రాయపడుతున్నా. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో అపచారాలు జరగకుండా చర్యలు చేపడతాం. పర్వదినాల్లో శ్రీవారి దర్శనం చేసుకోవాలని భక్తులు బలంగా కోరుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం చేయించే బాధ్యత టీటీడీపై ఉందని తెలిపారు.

### ఇద్దరు అధికారుల సస్పెన్షన్.. మరో ముగ్గురు బదిలీ

ఇలాంటి సమయాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. కానీ కొందరు బాధ్యతా రాహిత్యంగా ఉన్నట్లు కనిపిస్తోంది. డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నాం. ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, టీటీడీ సీఎస్ వో శ్రీధర్‌ను బదిలీ చేస్తున్నాం. జరిగిన మొత్తం ఘటనపై న్యాయ విచారణకు ఆదేశి స్తున్నాం. టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యులు, జేఈవో సహా కొండపై అందరూ సమన్వయంతో పనిచేయాలి. దేవుని పవిత్రతకు భంగం కలిగించకూడదు. పెత్తందార్లుగా కాకుండా సేవకులుగా దేవుని సేవలో పాల్గొనాలి. తిరుమల పవిత్రతను కాపాడతానని మరోసారి చెబుతున్నాము. 45 ఏళ్లుగా నేను రాజకీయాల్లో ఉన్నాను.

23 ఏళ్లు టీడీపీ అధికారంలో ఉంది. తిరుపతిలో టోకెన్లు ఇస్తున్నారని నాకు కూడా తెలియదు. అక్కడ మరిన్ని జాగ్రతలు తీసుకోవాల్సి ఉంది. తిరుమలలో ఉన్న తృప్తి.. తిరుపతిలో రాదని భక్తులు అంటున్నారు. గత ఐదేళ్లలో కొండపై చాలా అరాచకాలు జరిగాయి. కానీ రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తిరుమలకు వచ్చినప్పుడు నేను సామాన్య భక్తుడిగానే ఉంటా. వైకుంఠ ఏకాదశికి ఎన్ని టికెట్లు ఇవ్వాలనే దానిపైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# ప్రభుత్వం తరపున క్షమాపణ చెబుతున్నా...

- సిబ్బంది, పోలీసులు ఉండీ ఘటన దురదృష్టకరం
- ఈవో, ఏఈవో, పోలీసులు బాధ్యత తీసుకోవాలి
- టీటీడీ సభ్యులు మృతుల ఇళ్లకు వెళ్లి క్షమాపణ కోరాలి
- పోలీసు అధికారుల్లో కొందరు కావాలనే చేశారా?
- ఇంతమంది పోలీసులున్నా తప్పు ఎందుకు జరిగింది?
- ఈవో, అదనపు ఈవో, పాలకమండలికి గ్యాప్ ఉందా?
- అనుమానాలపై విచారణ జరగాల్సిన అవసరం ఉంది
- పోలీసు శాఖ నిర్లక్ష్యంపై సీఎం, డీజీపీ దృష్టికి తీసుకెళతా
- వేచి ఉండే ఒకట్రెండు గంటల్లో దర్శనం జరిగేలా చూడాలి
- మీడియాతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- ఘటనా స్థలం పరిశీలన.. క్షతగాత్రులకు పరామర్శ



తిరుపతి(చైతన్యరథం): వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుప తిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పారు. ఘటన జరిగిన ప్రాంతంతోపాటు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం ఆయన పరా మర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. “తప్పు జరిగింది..బాధ్యత తీసుకుంటాం.క్షతగాత్రులు, రాష్ట్ర ప్రజలు, వేంకటేశ్వరస్వామి భక్తులు, హైందవ ధర్మాన్ని నమ్మిన ప్రతిఒక్కరినీ క్షమించమని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోంది. ఈ ఘటన జరగకుండా ఉండాల్సింది. క్రౌడ్ మేనేజ్‌మెంట్ సరిగా జరగలేదని భక్తులు చెబుతున్నారు. టీటీడీ సిబ్బంది, పోలీసులు ఉండి కూడా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవ డం బాధాకరం. వీఐపీలపై కాదు.. సామాన్యుల పైనా టీటీడీ దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబాల వద్దకు టీటీడీ సభ్యులు వెళ్లి క్షమా పణలు చెప్పాలి. తొక్కి సలాట ఘటనకు ఈవో, ఏఈవో బాధ్యత తీసు కోవాలి. ఘటనా స్థలిలో ఉన్న పోలీసులు బాధ్యత తీసుకోవాలి. అధికారులు చేసిన తప్పులకు మేం తిట్లు తింటున్నాం. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలాఉండాలనే ప్రణాళిక లేదు.వ్యక్తులుచేసిన తప్పులు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్నాయి. భవిష్యత్తులో దుర్ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. పోలీసు ల్లో కొందరు కావాలని చేశారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఈ అనుమా నాలన్నింటిపై విచారణ జరగాల్సి ఉంది. ఈవో, అదనపు ఈవో, పాలకమండలికి మధ్య గ్యాప్ ఉందనే వాదన ఉంది. ఇంతమంది పోలీసు అధికారులున్నా తప్పు ఎందుకు జరిగింది? పోలీసుశాఖ నిర్లక్ష్యంపై సీఎం, డీజీపీ దృష్టికి మళ్లీ తీసుకెళతా. తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం 8- 9 గంటలు ఎదురు చూసే పరిస్థితి మారాలి. సాధ్యమైతే ఒకట్రెండు గంటల్లో దర్శనం జరిగేలా చూడాలని కోరారు.

# తమాషా అనుకోవద్దు

- బాధ్యత తీసుకున్నపుడు దాన్ని నెరవేర్చాలి
- డ్యూటీలో నిర్లక్ష్యాన్ని అస్సలు సహించను
- అధికారులను నిలదీసిన సీఎం చంద్రబాబు
- సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం
- స్విమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- వైద్యులనుంచి పరిస్థితిని అడిగి తెలుసుకున్న సీఎం
- మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని ఆదేశం



తిరుపతి (చైతన్య రథం): తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను ఏపీ సీఎం చంద్రబాబు గురువారం పరిశీలించారు. విజయవాడ నుంచి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి తిరుపతి వచ్చారు. నగరంలోని బైరాగిపట్టెడ వద్ద ఘటనాస్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఘటనకు గల కారణాలు, ప్రభుత్వం తరపున బాధితులకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా తితిదే ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలన్నారు. "భక్తుల రద్దీ పెరుగుతుంటే తితిదే అధికారులు ఏం చేస్తున్నారు? ప్రతి ఒక్కరికీ చెబుతున్నా.. బాధ్యత తీసుకున్నప్పుడు దాన్ని నెరవేర్చాలి. తమాషా అనుకోవద్దు" అని వ్యాఖ్యానించారు.

భక్తుల రద్దీ చూసి టికెట్లు ఇవ్వాలని తెలియదా? భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాక ఏం చేశారు? అని తితిదే జేఈవో గౌతమిని సీఎం నిలదీశారు. జేఈవోగా మీరు చేయాల్సిన బాధ్యత గుర్తులేదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అంబులెన్స్ లభ్యత గురించి సీఎం ఆరా తీశారు.

అనంతరం స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. తొక్కిసలాటలో గాయపడిన క్షతగాత్రులు దాదాపు 35మందిని పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెభుతూ, ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్విమ్స్ వైద్యులతో మాట్లాడిన సీఎం.. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. సీఎంవెంట మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో శ్యామలరావు, ఇతర అధికారులు ఉన్నారు.











# ఒకేసారి ఎందుకు వదిలారు?

## సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం



తిరుపతి (చైతన్య రథం): వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతి చేరుకున్నారు. బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కు చేరుకున్న డిప్యూటీ సీఎం.. తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును జేసీ శుభం బన్సల్, డీఎస్పీ చెంచుబాబు ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

భక్తులను ఎందుకు ఒకేసారి క్యూలైన్లలోకి వదలాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. హైవేకు దగ్గరగా ఉండటంతో భక్తులు పెద్దఎత్తున పద్మావతి పార్కుకు వచ్చారని అధికారులు వివరించారు. అనంతరం తొక్కిసలాటలో గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరామర్శించి ధైర్యం చెప్పారు.

# మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా

- పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రుల బృందం
- బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పిన వైనం
- మృతదేహాలను స్వస్థలాలకు పంపుతున్న ప్రభుత్వం



తిరుపతి (చైతన్య రథం): తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గురువారం ఉదయం మృతుల కుటుంబాలు, క్షతగాత్రులను పరామర్శించిన మంత్రుల బృందం, దుర్ఘటన చోటుచేసుకోవడానికి గల కారణాలను ఆరా తీశారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి అనిత, సమాచార మంత్రి పార్థసారథి, దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్య ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌లు పరామర్శించారు. స్విమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించి వైద్యులతో మాట్లాడారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జెసీలు మంత్రుల బృందం వెంట ఉన్నారు. రుయా ఆసుపత్రి మార్చురీలోవున్న మృతులను పరిశీలించి వారి కుటుంబాలను ఓదార్చి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మంత్రులు మాట్లాడుతూ ఏకాదశి దర్శనం టోకన్ ఇచ్చు ప్రదేశం వద్ద తొక్కిసలాటలో మృతిచెందిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. వైకుంఠ ఏకాదశి దర్శనం టికెట్లు పొందే ప్రతిచోట సిసి కెమెరాలు ఉన్నాయని వాటిని పరిశీలించి సంఘటనపై పూర్తి విచారణ చేసిన తర్వాత సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మృతిచెందిన వారి కుటుంబానికి రూ.25 లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు.

తిరుపతిలో జరిగిన సంఘటన తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులను తిరుపతికి పంపడం జరిగిందని తెలిపారు. ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని, ఇకపై ఇలాంటి సంఘటన జరగకుండా తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మృతిచెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, మృతులు తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన వారని, వారి మృతదేహాలను ప్రత్యేక వాహనం ద్వారా ఒక అధికారిని పంపించి వారి స్వగ్రామాలకు చేర్చడం జరుగుతుందన్నారు.

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: హోంమంత్రి అనిత

తిరుపతిలో తొక్కిసలాట ఘటన ప్రమాదమా..? కుట్రా..? అనే కోణంలో విచారణ చేస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. బాధితులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎవరి వైఫల్యం ఉందనేది సీసీ కెమెరాల ద్వారా తెలుస్తుందని చెప్పారు. బాధ్యులు ఏస్థాయిలో ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూస్తామని చెప్పారు.

వైకుంఠ ఏకాదశి మొదలయ్యే సమయంలోనే ఈ ఘటన జరగడం దురదృష్టకరమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఘటనకు కారణం తొందరపాటు చర్యా? సమన్వయా లోపమా? అనేది విచారణలో వెల్లడవుతుందని చెప్పారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపుతామన్నారు..
అంత్యక్రియలకు సహకారం అందించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు రెవెన్యూ మంత్రి అనగాని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.

### ఒక్కసారిగా గేట్లు తెరవడంతో తొక్కిసలాట: కలెక్టర్

టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద ఒక్కసారిగా గేట్లు తెరవడంతో తొక్కిసలాట జరిగిందని కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గాయపడిన వారికి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో వారు కూడా డిశ్చార్జి అవుతారని చెప్పారు. మృతదేహాలకు సత్వరమే పోస్టుమార్టం నిర్వహించి వారి స్వస్థలాలకు పంపుతామన్నారు.





చైతన్యరథం

# తొక్కిసలాట దురదృష్టకరం: ఈవో



తిరుపతి (చైతన్య రథం): తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తితిదే ఈవో శ్యామలరావు పరామర్శించారు. వారి పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని చెప్పారు.

ఇందులో 41మందికి గాయాలయ్యాయని, ఘటనకు గల కారణాలపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. డీఎస్పీ గేట్లు తెరవడంవల్లే ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. విచారణ తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని చెప్పారు. ప్రాథమిక చికిత్స అనంతరం కొందరిని వైద్యులు డిశ్చార్జి చేసినట్టు తితిదే ఈవో చెప్పారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని చెప్పారు. ఇద్దరికి మాత్రమే తీవ్ర గాయాలయ్యాయని.. చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే.

# సీఎంకు కలెక్టర్ నివేదిక

తిరుపతి (చైతన్య రథం): తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద తొక్కిసలాట జరిగి పెనువిషాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే.

ఈ దుర్ఘటనపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జిల్లా కలెక్టర్ నివేదిక సమర్పించారు. డీఎస్పీ అత్యుత్సాహం వల్ల ఒక్కసారిగా భక్తులు రావడంతో తొక్కిసలాట జరిగిందని అందులో పేర్కొన్నారు. "తొక్కిసలాట జరిగినా డీఎస్పీ సరిగా స్పందించలేదు. ఎస్పీ వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. 20 నిమిషాలపాటు డ్రైవర్ అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే భక్తులు చనిపోయారు" అని నివేదికలో వెల్లడించారు. అటు డీఎస్పీ తీరుపై ఎస్పీ సుబ్బారాయుడు, ఇతర అధికారుల నుంచి వివరాలు సేకరించి కలెక్టర్ ఈ నివేదిక అందించారు.

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం.. తిరుపతిలో 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్) టోకెన్ల జారీకి తితిదే అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ టికెట్ల కోసం భక్తులు పెద్దఎత్తున కేంద్రాల వద్దకు రాగా.. తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

### తిరుమల వైకుంఠద్వార దర్శనం

# తొలి మూడు రోజులకు టోకెన్ల జారీ

తిరుపతి (చైతన్య రథం): వైకుంఠద్వార దర్శనానికి సంబంధించి తితిదే టోకెన్ల జారీని పూర్తి చేసింది. తొలి మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లను జారీ చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 9 గంటల వరకు ఈ కోటాను పూర్తి చేసింది. వైకుంఠద్వార దర్శనం కోసం రోజుకు 40వేల టోకెన్ల చొప్పున జారీ చేశారు. వీటిని కలిగిన భక్తులను మాత్రమే 10, 11, 12 తేదీల్లో అనుమతించనున్నారు. 13నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద వైకుంఠ ద్వార దర్శన టికెట్లను ఏరోజుకారోజు ఇవ్వనున్నారు.



# విశాఖ వాసుల మృతి బాధాకరం

## మంత్రి డోలా సంతాపం

అమరావతి(చైతన్యరథం): తిరుపతి ఘటనలో ముగ్గురు విశాఖ వాసులు మృతి చెందడం బాధాకరమని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దైవ దర్శనానికి వెళ్లి తొక్కిసలాటలో చనిపోవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.25 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకుం టా మన్నారు. చనిపోయిన భక్తుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడతా

- **ఇప్పటి వరకు 31,590 ఎకరాలు అన్యాక్రాంతం**
- **తెలిసో, తెలియకో కొన్న వారు తిరిగి ఇవ్వాల్సిందే**
- **వచ్చే నెల నుంచి ఆన్‌లైన్‌లోనే లావాదేవీల నిర్వహణ**
- **కమర్షియల్ భూములను ఎవరికైనా లీజుకు ఇస్తాం**
- **వచ్చే ఆదాయంతో సిబ్బందికి జీతాలు చెల్లిస్తాం**
- **రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్**



విజయవాడ(చైతన్యరథం): రాష్ట్రంలో 65,783 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అజీజ్ మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు భగవంతుడి కోసం దాతలు ఇచ్చారని, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ముస్లిం మతానికి చెందిన పేద లకు, వితంతువులకు, అనాధలకు ఖర్చు చేస్తామే కాని ఇతరులు ఆక్రమించుకోవడానికి కుదరదన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తి అంటే దేవుడి ఆస్తి అని, దానికి బోర్డు చైర్మన్, సభ్యులు ధర్మకర్తలుగా మాత్రమే ఉంటామని చెప్పారు. ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడే బాధ్యత తమపై ఉందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు భగవంతుని కోసం దాతలు ఇచ్చారని, మసీదులకు మా తాతలు ధర్మకర్తలు, ముతావల్లీలుగా ఉన్నారు కాబట్టే ఆ ఆస్తిని అమ్ముకోవచ్చు అన్న అపోహలో కొందరు ఉన్నారు..అది జరుగదు..జరగనివ్వమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల వేంకటేశ్వర స్వామిని భక్తితో చూసి నట్లు వక్ఫ్‌బోర్డు ఆస్తులను కూడా అలాగే చూస్తారని, ముఖ్యమంత్రి నాపై పెట్టిన నమ్మకా న్ని వమ్ముకానివ్వనని తెలిపారు. ఎప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల అవసరాల కోసం వక్ఫ్ బోర్డు భూములను నష్ట పరిహారంగా తీసుకోవచ్చని, కానీ ప్రైవేట్ వ్యక్తులకు అది వీలుకాదన్నారు. గతంలో 65,783 ఎకరాల భూమి మసీదులు, దర్గాలకు దానంగా ఇచ్చారు.. ఇందులో 31,590 ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నట్లు చెప్పారు. ఈ భూములను కొందరు తెలిసో, తెలియకో కొన్నారు.. కొన్నవారు ప్రతి అంగుళం భూమిని వెనక్కి ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. వక్ఫ భూముల ఆక్రమణలపై సర్వే సంపూర్ణంగా జరగడం లేదన్న ఆయన..ఇప్పటివరకు జిల్లాల్లో 651 ఎకరాలపై 40 ఫిర్యాదులు వచ్చా యని చెప్పారు. కలెక్టర్, ఎస్పీలు ఈ ఫిర్యాదులపై దర్యాప్తు చేయాలని కోరుతున్నామ న్నారు. జిల్లాల్లో వక్ఫ ఇన్‌స్పెక్టర్లు చేయాల్సిన పనులను ఆక్రమణదారులు అడ్డుకుంటు న్నారన్నారు. వక్ఫ బోర్డుకు వచ్చిన ఆదాయం ఆయా ప్రాంతాల్లోనే అభివృద్ధికి ఉపయో గిస్తామని తెలిపారు. ఉదాహరణకు కొండవీటి దర్గా వద్ద 87 ఎకరాల వక్ఫ భూమి ఉండగా వాటిలో సగం ఆక్రమణలో ఉంద న్నారు. వాటి పరిశీలనకు వెళ్లిన అధికారులపై ఆక్రమణదారులు దాడి చేశారు.. ప్రస్తుతం దాడి చేసిన వాళ్లు జైల్లో ఉన్నారు. వక్ఫ బోర్డు కు చెందిన ఆస్తులు తక్కువకు కొన్నారు.. ఇదెక్కడి న్యాయమో తెలియటం లేదు.. ఇది దేవుడి ఆస్తి అని అందరమూ ధర్మంగా ఉందామని పిలుపు నిచ్చారు. దేవుడి ఆస్తి కాపాడి పేద ప్రజలకు మేలు చేయాలనే ఆశతో ఉన్నామన్నారు. ఫిబ్రవరి 1 నుంచి వక్ఫ్ బోర్డు లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో జరుగు తాయని చెప్పిన ఆయన వచ్చే ఆదాయం కూడా పారదర్శకంగా ఆన్‌లైన్ లోనే నిర్వహిస్తామని వెల్లడించారు. వక్ఫ బోర్డు నుంచి వచ్చే ఆదా యం నుంచే సిబ్బంది జీత భత్యాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఇకపై కమర్షియల్ భూము లను ఖాళీగా ఉంచం.. లీజ్‌కు ఇస్తామని తెలిపారు. దానివల్ల వక్ఫ్ బోర్డుకు ఆదాయం వచ్చేటట్టు చేస్తామని తెలి పారు. లీజ్‌ను ముస్లింలు మాత్రమే తీసుకోవాల న్న రూల్ ఏమీ లేదని, ఏ మతం వారైనా ఆ ఆస్తులను లీజుకు తీసుకో వచ్చని తెలిపారు. ప్రథమ ప్రాధాన్యత అంటూ ఎవరికీ ఉండదన్న ఆయన.. ప్రొహిబిటెడ్ పనులకు మాత్రం అంటే మద్యం షాపులు.. అలాంటి వాటికి మాత్రం వక్ఫ్‌బోర్డు ఆస్తులు లీజుకు ఇచ్చేది లేదని చెప్పారు. లీజు ఆస్తులపై వచ్చే రెవెన్యూ మాత్రం ముస్లిం మతానికి చెందిన పేదలు, వితంతు వులు, అనాధలకు మాత్రమే అందిస్తామన్నారు. పక్క రాష్ట్రాల నుంచి కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు నిధులు తెచ్చుకుంటున్నాయని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కూడా తెచ్చుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మంచి చేయాలనే సంకల్పంతో ఉన్న వక్ఫ్ బోర్డుకు అందరూ సహకరించాలని కోరారు.



# వెలుగొండతో జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

- **మంత్రులు డోలా, గొట్టిపాటి రవికుమార్**
- **మార్కాపురం టీడీపీలోకి భారీగా చేరికలు**

మార్కాపురం(చైతన్యరథం): వెలుగొండను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం తెలుగుదేశం పార్టీలోకి గురువారం భారీగా చేరిక లు జరిగాయి. 13 మంది కౌన్సిలర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్‌లతో పాటు మరో 2000 మంది టీడీపీలో చేరారు.

మంత్రులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలన లో జిల్లాకు ఒనగూరింది ఏమిటి? అని ప్రశ్నించారు. కూటమి ఆరు నెలల పాలనలోనే ప్రతి పల్లె, పట్టణంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. వెలుగొండ పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి జిల్లా ప్రజలను జగన్ మోసం చేశారని మండిపడ్డారు.



# వైసీపీ పుట్టుకలోనే శవరాజకీయాలు

- తిరుపతి మహా విషాదాన్ని రాజకీయం చేస్తారా?
- విచారించాల్సిందిపోయి.. విమర్శలకు దిగడం సిగ్గుచేటు
- జగన్ జమానాలో జనంకోసం ఏనాడైనా స్పందించారా?
- రుయా సంఘటన, బోటు ప్రమాదాలు గుర్తు లేవా?
- జగన్ తిరుపతి పర్యటన శవరాజకీయంలో భాగమే
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ధ్వజం



అమరావతి (చైతన్య రథం): తిరుపతిలో దుర్ఘటనపై అందరూ బాధపడుతుంటే వైసీపీ నేతలు రాజకీయ లబ్ధికోసం యత్నిస్తున్నారంటే ఇంతకంటే సిగ్గుమాలిన చర్య ఇంకోటి ఉండదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల ప్రమాద ఘటనపై చింతించాల్సింది పోయి వైసీపీ నేతలు విమర్శలు చేయడం దారుణమని, రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటించి రూ.2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులకు శ్రీకారం చుడితే.. ఇంత భారీస్థాయిలో జరిగిన అభివృద్ధిని డైవర్ట్ చేయడానికే దుష్టశక్తులు కుట్రకు పాల్పడ్డాయన్న అనుమానం ఉందన్నారు. ఈ దుర్ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కుట్ర కోణాన్ని బయట పెట్టాలని వర్ల రామయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడుతూ.. 'వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల వెంకన్న దర్శనం కోసం భక్తులు పోటెత్తి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తోపులాట జరిగి అనుకోని దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు అప్రమత్తమై మంత్రులను హుటాహుటిన ఘటనా స్థలానికి పంపించారు. అక్కడ పరిస్థితిని పర్యవేక్షించి.. సహాయ సహకారలు అందించాలని ఆదేశించారు. అధికారులను అలర్ట్ చేశారు. దుర్ఘటనపట్ల నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను హెచ్చరించారు. ఘటనా స్థలానికి ఉదయాన్నే వెళ్లి బాధితులను పరామర్శించి క్షతగాత్రులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కాని నాడు ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ తిరుపతి రుయా ఆసుత్రిలో ఆక్సిజన్ అందక 21మంది చనిపోతే కనీసం చూడటానికి కూడా వెళ్లలేదు. ప్రతిపక్షంలో ఉన్నా నాడు చంద్రబాబు వెళ్లి పరామర్శించారు. కచ్చులూరులో బోటు ప్రమాదం జరిగి 39మంది చనిపోతే ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి కనీసం కన్నెత్తి చూడలేదు. అన్నమయ్య గేటు కొట్టుకుపోయి 33మంది చనిపోతే వారిని పట్టించుకున్న పాపాన పోలేదు. నేడు జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అంబటి రాంబాబు, రోజాలాంటి నేతలు మాట్లాడే మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయి. టికెట్ల అమ్మకంతోపాటు దేవుడి సొమ్ములు మింగేసినోళ్లు.. శవం ఎక్కడ కనిపిస్తే అక్కడికి పరిగెట్టేటోళ్లు.. తిరుపతి విషాదంపై కనీసం మాట్లాడే అర్హత కూడా లేదని వర్ల రామయ్య దుయ్యబట్టారు.

ప్రమాదం వెనుక కుట్రం కోణం ఉన్నట్లు అనుమానాలున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందన్నారు. భక్తుల తోపులాట వెనుక గంజాయి మూక 15మంది వరకు ఉన్నట్లు తెలుస్తుందని, ఏదో జరిగిపోతుందని భయపడేలా అరుపులతో క్యూ లైన్లలో గందరగోళాన్ని సృష్టించినట్లు.. తోపులాటకు కారణమైనట్లు ఇప్పటికే గుర్తించారని అన్నారు. అంతేకాకుండా ఘటన జరిగిన వెంటనే నేషనల్ మీడియాకు సమాచారం వెళ్లడంపై అనుమానం ఉందని, కావాలనే ప్లాన్ చేసి తొక్కిసలాట జరిగేలా చేసి వీడియోలాను తీసి షేర్ చేశారని అనుమానంగా ఉందన్నారు. కోట్లు కోట్లు తిన్న రాబందులు ఖాళీగా ఉండి... ప్రభుత్వంపై ఏదోక బురద చల్లేందుకు ఇటువంటి కుట్రలు చేస్తుంటారని వర్గ దుయ్యబట్టారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని, ఇటువంటి జనాలు గుమిగూడే కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని వర్ల సూచించారు.

డిక్లరేషన్ ఇచ్చి తిరుమల రావడానికి బయపడిన జగన్‌కు.. తిరుమల విషాదంపై మాట్లాడే అర్హత ఉందా? అని వర్ల ప్రశ్నించారు. భక్తుల ప్రాణాలు పోవడంపై చంద్రబాబు కంట నీరు పెట్టుకున్నారు. బయటకు వస్తే క్రిస్టియన్‌నని... అటు వెళ్తే హిందువునని ఏ పూటకు ఆ మాట మాట్లాడే జగన్‌రెడ్డి మాటలు, ద్వంద్వ ప్రమాణ రాజకీయాలను ప్రజలు పట్టించుకోరని ఎద్దేవా చేశారు. ఇటువంటి వైపరీత్యాలను అడ్డుపెట్టుకుని అధికారం చేజిక్కించుకోవాలనే వైసీపీ కుయుక్తులు చెల్లవని, ప్రభుత్వంపై బురద చల్లాలని ప్రయత్నిస్తే.. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని వర్ల రామయ్య హెచ్చరించారు. సంఘటనపై సీనియర్ ఐఏఎస్ అధికారితో విచారణ చేపట్టాలని, ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వర్ల రామయ్య ప్రభుత్వాన్ని కోరారు.

# ఖరీఫ్ కరవుపై కేంద్రానికి నివేదిక!

## కేంద్ర బృందానికి ఆర్పీ సిసోడియా వినతి

- ప్రకటించిన కరవు కేంద్ర అధ్యయన బృందం
- ఖరీఫ్ -2024 పరిస్థితిపై పూర్తైన అధ్యయనం
- రైతులను ఆదుకోవడానికి సత్వర సాయం..
- రూ.151.77 కోట్లు సాయం అందించండి




అమరావతి (చైతన్య రథం): ఖరీఫ్ కరువు పరిస్థితులను అర్థం చేసుకుని సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేంద్రబృందాన్ని రెవెన్యూ శాఖ (ల్యాండ్స్, విపత్తుల నిర్వహణ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్) స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా కోరారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో గురువారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్‌దేవి నేతృత్వంలోని కేంద్ర బృందంతో సమావేశమై రాష్ట్రంలో కరవు పరిస్థితులను వివరించారు.

కేంద్ర బృందం సభ్యులు, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండించర్ డిప్యూటీ డైరక్టర్ సుప్రియా మాలిక్, నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అనురాధ బట్నా, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ కమిషనర్ దీపాంకర్ సేథ్, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ ప్రదీప్ కుమార్, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరక్టర్ మన్నూజీ ఉపాధ్యాయ్, గ్రామీణాభివృద్ధి శాఖ అండర్ సెక్రటరీ జయంతి, ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ కె పొన్నుస్వామిలు ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిపై చర్చించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరవు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాల్లోని 54 మండలాలు (అన్నమయ్య -19, చిత్తూరు -16, శ్రీ సత్యసాయి -10, అనంతపురం -7 మరియు కర్నూలు -2) ఇప్పటికే ప్రకటించడం జరిగింది. వీటిలో 27 తీవ్ర కరువు మండలాలు, 27 మధ్యస్థ కరువు మండలాలు ఉన్నాయి. కేంద్ర కరవు నిబంధనల ప్రకారం సాధారణ వర్షపాతంకంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33శాతం అంతకంటే ఎక్కువఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరవు ప్రాంతాలను ప్రకటించిందని ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా వివరించారు.

కరవు ప్రభావంతో పత్తి, జొన్న, వేరుశెనగ, ఎర్ర శనగలు, మొక్కజొన్న మొదలైన 14 రకాల పంటలు దెబ్బతిని ఐదు జిల్లాల్లోని 1.06 హెక్టార్ల విస్తీర్ణంలో 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు లక్షమంది రైతులకు రూ.16.67 కోట్ల వ్యయంతో 80శాతం సబ్సిడీపై విత్తనాలు, రూ.55.47 కోట్ల వ్యయంతో పశుగ్రాసం, పశుగ్రాస విత్తనాల సరఫరా, 60శాతం సబ్సిడీపై టీఎంఆర్ (టోటల్ మిక్స్‌డ్ రేషియో), 40శాతం సబ్సిడీపై చాఫ్ కట్టర్లు, మందుల సరఫరా వంటి ఉపశమన చర్యలు చేపట్టినట్లు కేంద్ర బృందానికి వివరించారు.

కరువు ప్రాంత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ. 90.62కోట్లు, రూరల్ వాటర్ సప్లై రూ. 0.78 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై రూ.4.89 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.55.47 కోట్లు ఆర్థిక సహాయం అవసరమన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలని ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్‌దేవి మాట్లాడుతూ.. కరవు కారణంగా నష్టపోయిన పంటల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామని తెలిపారు. పంట నష్టం జరిగిన రైతులను అన్ని విధాలా ఆదుకునేలా చూస్తామన్నారు. అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని కరవు మండలాల్లో రైతులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను గమనించామని తమ నివేదికలో కేంద్రానికి అన్ని విషయాలను సమగ్రంగా తెలుపుతామన్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కరవు పరిస్థితులు స్పష్టంగా అర్థమవుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో రైతులు కరువు వల్ల తమకు జరిగిన నష్టాన్ని వివరించారని తెలిపారు. నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించి వీలైనంతమేర ఆదుకోవడానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని పెరిన్ దేవి స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఉమ్రా యాత్రకు మంత్రి ఫరూక్

## - మక్కా, మదీనా ప్రార్థన మందిరాల సందర్శన

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఉమ్రా యాత్రకు శుక్రవారం రాత్రి బయలుదేరుతున్నారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా, మదీనా ప్రార్థన మందిరాలను సందర్శించి అనంతరం 18న మంత్రి ఫరూక్ తిరిగి రానున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న మంత్రి ఫరూక్‌ను మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య అధికారులు,ఇంకా పలువురు ముఖ్యులు అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉమ్రాయాత్ర విజయవంతంగా పూర్తి చేసుకొని రావాలని ఆకాంక్షిస్తూ దువా చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం, శాంతి సౌభాగ్యాల కోసం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉమ్రా యాత్రలో ప్రార్థిస్తానని పేర్కొన్నారు.

### చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలి: మంత్రి ఫరూక్

జీవనమార్గంలో ఏ రంగంలో రాణించాలన్నా చదువుతోనే సాధ్యమని న్యాయ, మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. గురువారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా, ఆదర్శప్రాయురాలిగా నిలిచిన షేక్ ఫాతిమా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. షేక్ ఫాతిమా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలతో షేక్ ఫాతిమా కలిసి పని చేశారన్నారు. బాలికా విద్య కోసం అహర్నిశలు కృషిచేసిన భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా షేక్ ఫాతిమా కార్యాచరణ అమలులో ఎన్నో ఇబ్బందులకు, భౌతిక దాడులకు కూడా గురైనప్పటికీ తాను అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసిన ఘనత సొంతం చేసుకుని భావితరాలకు ఆదర్శప్రాయురాలిగా నిలిచిందన్నారు. మైనారిటీ వర్గాలు, ప్రజలందరూ చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. చదువుతోనే తాము అనుకున్న రంగంలో ఉన్నతస్థాయిలోకి చేరేందుకు మార్గం సులభతరం అవుతుందన్నారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. బాలిక విద్య కోసం ఎంతో కృషి చేసిన షేక్ ఫాతిమా సేవలను ప్రభుత్వం 8వ తరగతి పాఠ్యపుస్తకాల్లో చేర్చి తగిన గౌరవం కల్పించిందన్నారు.

### ఉరుసు వేడుకలకు హాజరైన మంత్రి ఫరూక్

విజయవాడ సమీపంలోని కొండపల్లి గ్రామంలో జరిగిన హజరత్ సయ్యద్ షా బొఖారి 428వ ఉరుసు- ముబారక్ ఉరుసు మహోత్సవం తొలిరోజు కార్యక్రమానికి న్యాయ మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరయ్యారు. మూడు రోజులపాటు ఉరుసు మహోత్సవాన్ని నిర్వాహకులు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. పురాతన దర్గాను సందర్శించిన మంత్రి ఫరూక్ చాదర్‌ను సమర్పించారు. కార్యక్రమంలో ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు

## నీచే హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పోలో మంత్రి సవిత వెల్లడి

### నేతన్నలకు 365 రోజులు పని కల్పించడమే లక్ష్యం - సంక్రాంతికి చేనేత వస్త్రాలు ధరిద్దామని పిలుపు








అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రతి నెలా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ మరియు ఈడబ్ల్యూఎస్ సంక్షేమ మంత్రి ఎస్ సవిత వెల్లడించారు. ఎగ్జిబిషన్లు, ఎక్స్ పోలు నిర్వహణతో చేనేత వస్త్రాలు విక్రయాలు పెరిగాయాన్నారు. గురువారం విజయవాడలో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పోను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్ పోలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి, ఏ రాష్ట్రం నుంచి వచ్చారు... అమ్మకాలు ఎలా జరుగుతున్నాయి..? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఎంతో కీలకమైన చేనేతకు సీఎం చంద్రబాబు అండగా ఉంటున్నారన్నారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించడానికి రాష్ట్రంలోనూ, దేశ విదేశాల్లోనూ చేనేత ఎక్స్ పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పోను నిర్వహిస్తున్నామన్నారు. వారంపాటు నిర్వహించే ఎక్స్ పోలో 49 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంతోపాటు తెలంగాణ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మధ్యప్రదేశ్, జమ్మూ కశ్మీర్, బీహార్‌కు చెందిన 49 మంది చేనేత కార్మికులు, సొసైటీలు స్టాళ్లు ఏర్పాటు చేశాయన్నారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి దృష్టికి రాష్ట్రంలో చేనేత కార్మికుల సమస్యలను తీసుకెళ్లినట్లు మంత్రి వెల్లడించారు.

**చేనేతతో సంక్రాంతిని చేసుకుందాం..**

చేనేత వస్త్రాలు తెలుగు సంప్రదాయానికి ప్రతీక అని మంత్రి సవిత అన్నారు. రాబోయే సంక్రాంతికి ప్రజలంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని పిలుపునిచ్చారు. తెలుగింటి పెద్దపండగ సంక్రాంతిని చేనేతతో జరుపుకుందామన్నారు. చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని మంత్రి సవిత కోరారు.

**365 రోజులూ పని కల్పిస్తాం...**

చేనేత కార్మికులకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. నీచే హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో సందర్శించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 35 రకాల నాణ్యమైన చేనేత వస్త్రాలను నేతన్నలను తయారు చేస్తున్నారన్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

చేనేతలకు చంద్రబాబు పాలన ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి వ్యాఖ్యానించారు. గడిచిన 6 నెలల కాలంలో మూడు ఆప్కో షోరూమ్‌లను కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 10 క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు ఆదిత్య బిర్లా గ్రూప్ సహకారం తీసుకుంటున్నామన్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలకు, నేతన్నలకు 365 రోజులపాటు పని కల్పించేలా టాటా సంస్థతో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. ఇప్పటికే ఆ సంస్థ ఆధ్వర్యంలో కార్యకలాపాలు ప్రారంభించామన్నారు. త్వరలో 5 శాతం జీఎస్టీ రియింబర్స్‌మెంట్‌కు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆప్కో ఎండీ పావనమూర్తి, వీవర్స్ సర్వీస్ సెంటర్ డీడీ సాహూ తదితరులు పాల్గొన్నారు.



## సోలార్ పవర్ కార్పొరేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి

అమరావతి (చైతన్య రథం): ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను చీఫ్ సెక్రటరీ కే. విజయానంద్‌తో కలిసి రాష్ట్ర విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సచివాలయంలోని మూడో బ్లాక్‌లోని మంత్రి ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. పునరుత్పాదక రంగానికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని రూపొందించామన్నారు. గతంలో రాష్ట్రాన్ని విడిచి వెళ్లిన పునరుత్పాదక రంగం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో సోలార్ పవర్ కార్పొరేషన్ పనితీరును మంత్రి గొట్టిపాటి అభినందించారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కార్పొరేషన్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎండీ చక్రధర్ బాబు, ట్రాన్స్ కో జేఎండీ కీర్తి చెకూరి, సీపీడీసీఎల్ సీఎండీ పఠాన్ శెట్టి రవిసుభాష్, సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండీ కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం దార్శనికతకు నిదర్శనం ఆర్టీజీఎస్

**- క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి డాటా ఎంతో ముఖ్యం**
**- ప్రభుత్వ పనితీరులో ఆర్టీజీఎస్ సహకారం ఎంతో అవసరం**
**- పౌరసరఫరాల మంత్రి నాదేండ్ల మనోహర్ స్పష్టీకరణ**





అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపు, దార్శనికతకు రియల్ టైమ్ గవర్నెన్స్ ఒక నిదర్శనమని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదేండ్ల మనోహర్ అన్నారు. టెక్నాలజీతో పాలనను కొత్త పుంతలు తొక్కించగలమని ఆర్టీజీఎస్ ద్వారా సీఎం నిరూపించారన్నారు. గురువారం ఆయన సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీని సందర్శించారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె దినేష్‌కుమార్ మంత్రికి స్వాగతం పలికి, ఆర్టీజీఎస్ పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నాదేండ్ల మనోహర్ మాట్లాడుతూ ఒక రాష్ట్ర ప్రభుత్వానికి ఇంతమంచి వ్యవస్థ కలిగి ఉండటం అద్భుతమన్నారు. ఈ సాంకేతిక సదుపాయంతో ప్రభుత్వంలో మరిన్ని విప్లవాత్మక మార్పులు చేపట్టగలమన్న నమ్మకం ఆర్టీజీఎస్‌ను చూశాకా కలుగుతోందన్నారు. టెక్నాలజీ కలిగి ఉండటం ఒక ఎత్తైతే, డాటా కలిగి ఉండటం అనేది చాలా ముఖ్యమన్నారు. డాటా వాస్తవాన్ని చాటుతుందని, డాటాను ఉపయోగించుకుని క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆస్తులు, పథకాలు అమలు తీరు, లబ్దిదారులకు పథకాలు ఎలా అందుతున్నాయి తదితర అంశాలను సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు.

రియల్ టైమ్ గవర్నెన్స్‌ను ప్రజలకు ఒక పద్ధతి పకారం క్షేత్రస్థాయిలో పంచాయతీ, పురపాలకస్థాయిలో అందించడానికి ఆర్టీజీఎస్ చక్కగా పనిచేస్తోందన్నారు. ఈ సమాచారంలో శాఖల్లో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఇంకా మెరుగ్గా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, అలాగే కార్యక్రమాల అమలుకు ఒక నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకుని ప్రభుత్వంలో జవాబుదారీతనం పెంచేలా ఉపయోగించుకోవచ్చని ఆర్టీజీఎస్‌ను చూశాకా నమ్మకం కలుగుతోందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సాంకేతిక సహకారం అందించడంలో అద్భుతంగా పనిచేస్తున్న ఆర్టీజీఎస్ సీఈఓ, ఆ సంస్థ అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

ఒకే ప్రభుత్వం, ఒకే రాష్ట్రం, ఒకే పౌరుడు, ఒకే డాటా విధానంతో స్మార్ట్ గవర్నెన్స్‌ను ప్రజలకు అందించే విధంగా ఆర్టీజీఎస్ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయనేది నిరంతరం పర్యవేక్షిస్తూ ఆర్టీజీఎస్ ఎప్పటికప్పుడు తనవద్ద ఉన్న డాటా ఆధారంగా విశ్లేషిస్తోందన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో అపారమైన డాటా లభ్యమవుతోందని, అయితే ఇప్పటి వరకు ఈ డాటా అంతా ఒకేచోట అనుసంధానం కాలేదని, ఆర్టీజీఎస్ ఇప్పుడు అన్ని శాఖల్లో లభ్యమవుతున్న డాటాను సేకరించి ఒక పెద్ద డాటా లేక్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు, డీప్‌టెక్ సాంకేతిక సదుపాయాలను ఉపయోగించుకుని ఈ డాటాను విశ్లేషించి ప్రజలకు మరింత మెరుగైన సేవలను ప్రభుత్వం అందించడానికి ఆర్టీజీఎస్ సహకారం అందిస్తుందని చెప్పారు.

రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ, ప్రతి పల్లెకు ఒక ప్రత్యేక ప్రొఫైల్ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. త్వరలోనే వాట్సాప్ గవర్నెన్స్ కూడా ప్రజలకు అందుబాటులోకి రాబోతోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం మాధురి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# భూసమస్యలపై బాధితుల గగ్గోలు

## వల్లభనేని అనుచరుడిపై గ్రీవెన్స్‌లో బాధితుడి ఫిర్యాదు

### సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలిచ్చిన బాధితులు - స్వీకరించిన ఎమ్మెల్సీ పంచుమర్తి, మంత్రి మండిపల్లి

అమరావతి (చైతన్య రథం): వైసీపీ హయాంలో సాగిన భూకబ్జాలపై బాధితులు గ్రీవెన్స్‌కు అర్జీలు అందిస్తూనే ఉన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ కావలి గ్రీష్మలు వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామానికి చెందిన బోకినాల సాంబ శివరావు అర్జీని ఇస్తూ.. వల్లభనేని వంశీ అనుచరుడు తప్పుడు పత్రాలతో భూమిని కబ్జా చేయాలని యత్నిస్తున్నాడని.. దయచేసి అధికారులు తన సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన మైలాపురం చక్రవర్తి విజ్ఞప్తి చేస్తూ.. తనకు గత టీడీపీ ప్రభుత్వంలో టిక్కో ఇళ్లు మంజూరు చేశారని.. అయితే తరుతవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అర్హుల జాబితానుండి తన పేరును తొలగించి అన్యాయం చేశారని, తనకు టిక్కో ఇళ్లు ఇచ్చి న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. కడప జిల్లా రామేశ్వరం గ్రామానికి చెందిన రవణమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తాను అన్ని పర్మిషన్‌లు తీసుకొని బోరువేసుకున్నాక తమ ఊరిలో ఉండే వ్యక్తి కాడె పెద్ద ఓబయ్య తన బోర్ పక్కనే ఎటువంటి అనుమతులు లేకుండా బోర్‌వేసి అక్రంగా కరెంట్ వాడుతున్నాడని.. అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే..



అధికారులు అతనివద్ద లంచం తీసుకొని అన్ని అనుమతులు ఉన్న తన బోర్‌ను అక్రమంగా సీజ్ చేశారని దీనిపై అధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి వేడుకున్నారు.

పల్నాడు జిల్లా దాడేపల్లి మండలం నడికూడి గ్రామానికి చెందిన పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తూ.. తమ పొలాన్ని జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సేకరించి తమకు రావాల్సిన పరిహారం చెల్లించలేదని, పరిహారం ఇప్పించాలని అర్జీ ఇచ్చారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 14/2లో ఉన్న తన నాన్నగారి పేరుమీదున్న భూమిని అధికారులు అక్రమంగా మరొకరికి ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాలు ఇచ్చారని, దీనిపై విచారణ జరిపి భూమి తమకు దక్కేలా చూడాలని దొడ్డాజు శ్రీనివాసాచారి నేడు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు.

తమ భూమిని పేదల ఇళ్లకు ఇవ్వగా తమకు ప్రభుత్వం మరోచోట భూమి కేటాయిస్తే అందులో సాగు చేసుకుంటుండగా.. పోరుమామిళ్ల ఎమ్మార్వో ఆఫీసులో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ సురేష్ అనే వ్యక్తి అక్రమంగా తమ స్వాధీనంలో ఉన్న భూమిని తన తల్లి పేరుమీదకు మార్చుకున్నాడని.. అతనిపై చర్యలు తీసుకొని భూమిని తమకు ఆన్‌లైన్ చేయాలని కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన నడిపి వెంకట సుబ్బయ్య విజ్ఞప్తి చేశాడు. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం శంకవరం గ్రామానికి చెందిన జి ధనలక్ష్మీ విజ్ఞప్తి చేస్తూ.. తమ స్థలాన్ని వేరొకరు కబ్జా చేస్తున్నారని, దీనిపై అధికారులు సర్వే చేసి తమ స్థలానికి సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. దీంతో కబ్జాదారులు తమ స్థలానికి వేసుకున్న కంచెను ధ్వంసం చేసి తమను బెదిరిస్తున్నారని అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.







# 11న వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

## - బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్ సవిత వెల్లడి

- గుంటూరు ఏ1 కన్వేన్షన్‌లో రాష్ట్రస్థాయి వేడుకలు
- అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహణ
- బీసీ సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత

అమరావతి (చైతన్య రథం): ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను 11న రాష్ట్రస్థాయిలోనూ మరియు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బీసీల ఆత్మగౌరవానికి పెద్ద పీట వేస్తూ విశ్వకర్మ, వాల్మీకి మరియు కనకదాస జయంతులను ఘనంగా నిర్వహించారన్నారు. అలాగే మరో బీసీ ముద్దు బిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను 11న గుంటూరు ఏ1 కన్వెన్షన్ హాలులో, అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఘనంగా నిర్వహించేందుకు ఉత్తర్వులను జారీ చేశారన్నారు.

కర్నూలు జిల్లా రేనాటి ప్రాంతంలో 1807 జనవరి 11న సంచార జాతికి చెందిన వడ్డెర కులంలో ఓబన్న జన్మించారని, శిస్తులు వసూలు విషయంలో బ్రిటీష్ ఈస్టు ఇండియా కంపెనీ అధికారులకు మరియు రేనాటి పాలెగాళ్లకు మధ్య ప్రారంభమైన ఘర్షణలు క్రమేపీ సాయుధ పోరాటాలుగా మారాయన్నారు. నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటం ఇందులో ముఖ్యమైందన్నారు. ఈ పోరాటంలో సైన్యాధ్యక్షుడిగావున్న వడ్డే ఓబన్న వీరోచిత పాత్రను పోషించారని, వడ్డెర్లు, బోయలు మరియు చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని 10 వేలమందితో ఏర్పాటు చేసుకొని బ్రిటీష్ సైన్యంతో వీరోచితంగా పోరాడిన మహోన్నత వ్యక్తి వడ్డే ఓబన్న అని అన్నారు. బ్రిటీష్ పాలకుల దౌర్జన్యానికి వ్యతిరేఖంగా వడ్డే ఓబన్న చేసిన పోరాట పటిమను భవిష్యత్ తరాలవారికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జయంతి నిర్వహణ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత**

బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. బడుగు, బలహీన వర్గాల రాజకీయ, సామాజిక అభ్యున్నతికి స్వర్గీయ ఎన్టీఆర్‌తోపాటు ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా బీసీలకు బడ్జెట్లో రూ.39,007 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు 60 వేలమందికి లబ్దిచేకూర్చేలా ఈడబ్ల్యుఎస్ కార్పొరేషన్లకు రూ.10,273.80 కోట్లు కేటాయించామన్నారు. బీసీ హాస్టళ్ల విద్యార్థుల డైట్ బిల్లుల కోసం బడ్జెట్‌లో కేటాయించిన దానికంటే అదనంగా రూ.45.52 కోట్లు ఇస్తున్నట్టు చెప్పారు. కాస్మోటిక్ ఛార్జీలకు బడ్జెట్‌లో రూ.11 కోట్లు కేటాయించగా, అదనంగా మరో రూ.21.60 కోట్లు మంజూరు చేశామన్నారు. ట్యూటర్ల పారితోషకానికి




బడ్జెట్‌లో కోటి కేటాయించగా, ఇప్పుడు రూ.3.20 కోట్లు అదనంగా చెల్లిస్తున్నామన్నారు. గతంలో నిర్మాణం ప్రారంభించి 80 శాతం పనులతో అసంపూర్తిగా నిలిచిపోయిన 5 బీసీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.85 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అమరావతిలో 5 ఎకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ నిర్మించబోతున్నామని, బీసీ అభ్యర్థుల కోసం ఇటీవల విజయవాడలో ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్ ప్రారంభించామన్నారు. ఈ సెంటర్‌లో 110మంది అభ్యర్థులకు ఉచిత వసతితో కూడిన సివిల్స్ శిక్షణ అందిస్తున్నామన్నారు. 26 జిల్లాల్లో ఉచిత డీఎస్సీ కోచింగ్ ద్వారా 6 వేలమందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. త్వరలో ఆన్‌లైన్ శిక్షణా తరగతులు కూడా ప్రారంభించబోతున్నామన్నారు. ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్పులకు రూ.31.51 కోట్లు, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్పులకు రూ.222.97 కోట్లు కేటాయించామన్నారు. ఇటీవల 104 బీసీ హాస్టళ్లలో ఎస్సార్ శంకరన్ రిసోర్సు సెంటర్లు ఏర్పాటుచేశామని, ఈ సెంటర్ల ద్వారా విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యం పెంచడంతోపాటు విషయ పరిజ్ఞానం పెంపుదలకు ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన అధ్యాపకుల బోధనలు, కంటెంటును అందజేస్తున్నామన్నారు. 2014-19 మధ్య ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన విద్యార్థులకు రూ.45.54 కోట్ల బకాయిలు చెల్లిస్తున్నామన్నారు. నిర్మాణంలో ఉన్న మూడు బీసీ భవనాలను పూర్తిచేయడానికి రూ.10.12 కోట్లు విడుదల చేశామన్నారు. రూ.18 కోట్లతో వసతి గృహాల్లో వంట సామాగ్రి, ఇతర వస్తువుల కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే హాస్టళ్లలో ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. రూ.13.10 కోట్లతో వసతి గృహాల మరమ్మతులు చేపట్టామన్నారు. బీసీ యువతను, మహిళలను ఎంఎస్‌ఎంఈ ద్వారా పారిశ్రామికవేత్తలుగా రూపొదించే కార్యక్రమాన్ని చేపట్టామని, ఇప్పటికే బీసీ కార్పొరేషన్ల ద్వారా యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా 1700 జనరిక్ మెడికల్ షాపులు బీసీ బిడ్డలతో ప్రారంభించబోతున్నామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన కాపు భవనాలను పూర్తిచేయడానికి రూ.5.41 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. ఈడబ్ల్యూఎస్‌లో ఉన్న బీపీఎల్ కుటుంబాలను అభివృద్ధి చేయడానికి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. ఏపీ బ్రాహ్మణ క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ మాదిరిగా ఇతర ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్లకు కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలు ఏర్పాటుచేసి వ్యక్తిగత, గ్రూపు రుణాలు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఏపీ ఆర్యవైశ్య, రెడ్డి, కమ్మ కోపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు.

# విశాఖను ఐటీకి ప్రధాన కేంద్రంగా తయారు చేస్తాం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపటాన్ని ఐటీకి ప్రధాన కేంద్రంగా తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆలోచన చేస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కే.రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. అందులో భాగంగా త్వరలో ఐటీ దిగ్గజ సంస్థలు.. విశాఖపట్నంకు రానున్నాయని తెలిపారు. విశాఖపట్నం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయని చెప్పారు. ప్రపంచంలోనే విశాఖను గర్వ కారణమైన నగరంగా తయారు చేయాలని ముందుకు వెళుతోన్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం వేదికగా డిజిటల్ టెక్నాలజీ రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతోంది. రెండో రోజు గురువారం జరిగిన ఈ సదస్సులో పాల్గొన్న రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ... విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్ షో, బహిరంగ సభ నా భూతో నా భవిష్యత్తు అన్న విధంగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారని గుర్తు చేశారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి ప్రధాని మోదీ ఆనందం వ్యక్తం చేశారన్నారు.

# పొందూరులో తగ్గుముఖం పట్టిన డయేరియా

పొందూరు (చైతన్యరథం): పొందూరు మండల కేంద్రం ఖస్పావీధిలో మూడురోజుల కిందట ప్రబలిన డయేరియా తగ్గుముఖం పట్టింది. పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపదికన చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలు, సురక్షితమైన తాగునీటి సరఫరాతోపాటు ఇంటింటికి వెళ్లి వైద్యులు అందిస్తున్న చికిత్సలతో వ్యాధి అదుపులోకి వచ్చింది. గత బుధవారం కేవలం ఇద్దరు మాత్రమే డయేరియాతో స్థానిక ఆసుపత్రిలో చేరారు. వీరికూడా ముందురోజు చికిత్స తీసుకుని మెరుగైన చికిత్సకోసం ఆసుపత్రిలో చేరారు. కాగా పొందూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను శ్రీకాకుళం డీసీహెచ్ ఎన్.కల్యాణ్‌బాబు పరామర్శించి వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్‌తోపాటు ఎపిడమాలజిస్ట్ సుజాత, సూపరింటెండెంట్ పి.సుజాత, వైద్యులు రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు. డయేరియా వ్యాధి ప్రబలడానికి కారణమైన పెద్ద చెరువు పరిసరాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ చెరువులో కలుషితమైన చేపలు తినడం ద్వారానే కస్పావీధిలో పదుల సంఖ్యలో డయేరియా బారినపడ్డారు. చెరువు పరిసరాల్లో బుధవారం మరోసారి నిర్వహించిన పారిశుధ్య పనులను డీఎల్‌పీవో ఐవీ రమణ పరిశీలించారు.



# వైకుంఠ ప్రాప్తిని కలిగించే ముక్కోటి ఏకాదశి



వ్యాస మహర్షి రచించిన భవిష్యోత్తర పురాణం ప్రకారం సాధారణంగా మార్గశిర మాసం శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా జరుపుకుంటారు. అయితే ముక్కోటి ఏకాదశికి ఓ ప్రత్యేకత ఉంది. మార్గశిర మాసంలో కానీ పుష్య మాసంలో కానీ ధనుర్మాసం అంటే సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించాక వచ్చే శుక్ల పక్ష ఏకాదశిని మాత్రమే ముక్కోటి ఏకాదశిగా జరుపుకోవాలి. 2024వ సంవత్సరంలో అసలు ముక్కోటి ఏకాదశి రాలేదు. కొత్త సంవత్సరం 2025 జనవరి 10వ తేదీ పుష్య మాసం శుక్ల పక్ష ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా జరుపుకోవాలని పండితులు పంచాంగకర్తలు సూచిస్తున్నారు. శ్రీ మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై, మూడు కోట్ల మంది దేవతలతో కలిసి భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కాబట్టి ఈ ఏకాదశికి ముక్కోటి ఏకాదశి అని పేరు వచ్చిందని అష్టాదశ పురాణాల ద్వారా తెలుస్తోంది. ముక్కోటి ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనానికే ప్రాధాన్యత. కాబట్టి ఈ రోజు తెల్లవారుజాము 3 గంటల నుంచి వైష్ణవాలయాలకు వెళ్లి ఉత్తర ద్వార దర్శనం చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ఉత్తర ద్వార దర్శనంగా పిలిచే వైకుంఠ ద్వార దర్శనం చేయడం వలన శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో సకల శుభాలు చేకూరుతాయని విశ్వాసం. ఇంట్లో బ్రహ్మి ముహూర్తంలో శ్రీ లక్ష్మీ నారాయణులను యథాశక్తి పూజించి, విష్ణు సహస్రనామ పారాయణం చేసుకోవాలి. ఆలయాలలో శ్రీ విష్ణువుకు తులసి మాల భక్తితో సమర్పించాలి. ముక్కోటి ఏకాదశి రోజు చేసే ఉపవాసం 24 ఏకాదశి ఉపవాసాలతో సమానమని శాస్త్రం చెబుతోంది. అందుకే ఈ రోజు ఉపవాసం ఉండడం తప్పనిసరి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పాలు, పండ్లు వంటి సాత్విక ఆహారం తీసుకోవచ్చు. సాయంకాలం సంధ్యా కాల పూజ చేసుకుని, ఆ రాత్రి జాగరణ చేయాలి. జాగారం చేసేటప్పుడు భగవంతుని కీర్తనలు, భాగవత కథలు, హరికథా కాలక్షేపం, సత్సంగంతో జాగరణ చేస్తే జాగరణ ఫలం సంపూర్ణంగా దక్కుతుంది. ఏకాదశి అంటే 11. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనసు కలిపి మొత్తం 11. ఏకాదశి ఉపవాసం రోజు ఈ పదకొండును అదుపులో ఉంచుకొని వాటిపై నియంత్రణ సాధిస్తూ ఏకాదశి దీక్షను చేయడమే ఏకాదశి వ్రతం యొక్క అంతరార్థం. ముక్కోటి ఏకాదశి వ్రతం నిష్ఠగా ఆచరించే వారికి జ్ఞానం కలుగుతుంది. భగవత్ తత్వం బోధపడుతుంది. పరమ పవిత్రమైన ముక్కోటి ఏకాదశి రోజు నిష్ఠగా సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తే మామూలు రోజుల్లో కన్నా కోటి రెట్లు అధిక ఫలితం ఉంటుంది. భక్తి శ్రద్ధలతో నియమనిష్ఠలతో ఏకాదశి వ్రతం ఆచరించిన వారు మరుసటి రోజు అంటే ద్వాదశి రోజు ఉదయాన్నే శుచియై నిత్య పూజా కార్యక్రమం ముగించుకొని ఒక సద్బ్రాహ్మణునికి భోజనం పెట్టి, దక్షిణ తాంబూలాలు ఇచ్చి నమస్కరించుకుని భగవంతునికి నివేదించిన ప్రసాదాన్ని స్వీకరించి ఉపవాసాన్ని విరమించాలి. ఏకాదశి రోజు ఉపవాసం చేసి హరినామ స్మరణతో గడిపిన వారికి శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో ఏకాదశి పుణ్య ఫలం లభిస్తుందని శాస్త్రం చెబుతోంది. వైకుంఠ ఏకాదశి రోజు మనం కూడా వైకుంఠ ద్వార దర్శనం చేసి, ఉపవాస జాగారాలతో విష్ణుమూర్తిని సేవించి తరిద్దాం.

# గుడివాడ అమర్నాథ్... తీరు మార్చుకో!

- లేదంటే రాజకీయంగా కనుమరుగు కావడం ఖాయం
- హెచ్చరించిన టీడీపీ నేత గండి బాబ్జి



విశాఖపట్నం (చైతన్యరథం): గుడివాడ అమర్నాథ్... నీ తీరు మార్చుకో లేదంటే రాజకీయంగా కనుమరుగు కావడం ఖాయమని టీడీపీ నేత, రాష్ట్ర కో ఆపరేటివ్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జి హెచ్చరించారు. తిరుమలలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని, ఇలాంటి ఘటన చోటుచేసుకున్న సమయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిందిపోయి రాజకీయ విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. తిరుమల తొక్కిసలాటలో విశాఖకు చెందిన పలువురు మృతి చెందడం ఎంతో బాధాకరమని, మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు. ఘటనలో గాయపడిన క్షతగాత్రులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం చికిత్స అందిస్తుందన్నారు. మృతి చెందినవారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు.

**ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న వైసీపీ**

మోదీ పర్యటనలో సుమారు 2 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపన జరిగిందని, ఈ పెట్టుబడులతో రాబోయే కాలంలో మూడు నుంచి నాలుగు లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. మూడు నుంచి నాలుగు లక్షల ఉద్యోగాలు వస్తాయి అని అన్నారు. తాము చేసిన శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకే ఇప్పుడు తాజాగా మరోసారి శంకుస్థాపనలు చేస్తున్నారని వైసీపీ నాయకులు మాట్లాడటం అర్థరహితమన్నారు. గతంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ వచ్చారా? అని ప్రశ్నించారు. విశాఖ రైల్వే జోన్‌కు ఐదేళ్లుగా భూములు కేటాయించలేని మీరా మాపై ఆరోపణలు చేసేది అంటూ బాబ్జి మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దోచుకోవడమే లక్ష్యంగా పరిపాలన సాగించారని, మంత్రిగా గుడివాడ అమర్నాథ్ గత ఐదేళ్లలో ఏం సాధించారో చెప్పాలన్నారు. ప్రమాదాలు జరిగితే కమీషన్లు వసూలు చేసుకొనే అమర్నాథ్... చంద్రబాబుపై విమర్శలు చేయడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను విమర్శించే స్థాయి అమర్నాథ్‌కు లేదని, మైక్ దొరికింది కాదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే ప్రజల్లో కోడిగుడ్డు మంత్రిగా పేరుపొందిన అమర్నాథ్... ఇకనైనా తన పంథాను మార్చుకోవాలని లేదంటే రాబోయే రోజుల్లో రాజకీయాల్లో కనుమరుగు కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గొంపా సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# తిరుపతి సంఘటన ఎంతగానో కలిచివేసింది

- విచారం వ్యక్తం చేసిన ఎం.వి ప్రణవ్‌గోపాల్



విశాఖపట్నం (చైతన్యరథం): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు విశాఖపట్నం నుంచి వెళ్లిన యాత్రికులు అక్కడ జరిగిన తొక్కిసలాటలో చనిపోవడం ఎంతో బాధాకరమని, తిరుపతిలో జరిగిన ఈ దారుణమైన సంఘటన నన్ను ఎంతగానో కలిచివేసిందని వి.ఎం.ఆర్.డి.ఎ ఛైర్ పర్సన్ ఎం.వి ప్రణవ్‌గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ మేరకు విశాఖలో జరిగిన మీడియా సమావేశంలో ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ... సాధారణ భక్తులకు టీటీడీ దర్శనం టికెట్స్ జారీకి ఉన్న ఈ-దర్శన్ కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వం మూసివేసిందని, ఈ-దర్శన్ కేంద్రాలు అందుబాటులో ఉంటే ఈ సంఘటన జరిగేది కాదన్నారు. జరిగిన సంఘటనను రాజకీయం చేయడం సరికాదని, టీటీడీని భ్రష్టు పట్టించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. టీటీడీని ప్రక్షాళన చేసే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని, సంఘటన జరిగిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు స్పందించి తక్షణ సహాయక చర్యలు ప్రారంభించారని అన్నారు. పలువురు మంత్రులు తిరుపతి హుటాహుటిన వెళ్లేలా తగిన ఆదేశాలు జారీ చేశారని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానుకోవాలని, అక్కడ వాస్తవ పరిస్థితిని చూడకుండానే ఇలా నానా యాగి చేయటం సబబు కాదన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి



ఏలూరు (చైతన్యరథం): సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకుని విద్యార్థులంతా కంప్యూటర్ విద్యపై పూర్తిస్థాయిలో ప్రావీణ్యత సాధించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. ఏలూరు అగ్రహారంలోని కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ఐడిబిఐ బ్యాంక్ సౌజన్యంతో సమకూర్చిన 11 కంప్యూటర్లతో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. తొలుత ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే చంటికి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఆయన,,, ఒక కంప్యూటర్‌కు స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలానికి తగ్గట్టుగా విద్యార్థులంతా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించేందుకు కార్పొరేషన్ ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో ఒక ఉపాధ్యాయుడ్ని కూడా నియమిస్తామని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థుల్లోని పరిజ్ఞానాసక్తికి మరింత పదును పెట్టేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధకనపరచాలని ఎమ్మెల్యే చంటి సూచించారు. ఈ కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టీడీపీ నగరాధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, చోడే బాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. సునీత, ఐడిబిఐ బ్రాంచ్ మేనేజర్ వి. శ్రీనివాసరావు, బ్యాంక్ రీజనల్ ఇన్‌ఛార్జ్ మనీష్ రాజు, మేనేజర్ అనీల్ కుమార్, బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యసేవలు వినియోగించుకోవాలి




పోలవరం (చైతన్యరథం): ఎన్టీఆర్ ట్రస్టు జీఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ తప్పకుండా వినియోగించుకోవాలని నియోజకవర్గ టీడీపీ నాయకులు కోరారు. గురువారం పోలవరం నియోజకవర్గం బుట్టాయగూడెం మండలం గణపవరం గ్రామ ఏజెన్సీ ప్రాంతంలో ఎన్టీఆర్ ట్రస్ట్, జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన బస్‌లో ఆయా గ్రామాల్లో పర్యటించి స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందించింది. సీజనల్ వ్యాధులు, తలనొప్పి, షుగర్, బీపీ, థైరాయిడ్, నరాల సమస్యలు మొదలగు వాటికి చికిత్సలు అందించడంతో పాటుగా ఉచితంగా మందులు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున వైద్య బృందాలు, లాయర్ జేసుబాబు, స్టాఫ్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై అవగాహన

బలిజిపేట : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో శ్రమశక్తి సంఘాలు, మేట్లు పునర్వ్యవస్థీకరణ, దినసరి కూలీ గిట్టుబాటు తదితర అంశాలపై ఉపాధి సిబ్బందికి గురువారం క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. మండలంలోని తుమరాడ గ్రామంలోని తోటలో ఉపాధి పనులు ఆరు నెలల పాటు విజయవంతంగా నిర్వహించాల్సిన అంశాలపై ఏపీవో కేశవరావు, ఈసీ శ్రీనివాసరావులు క్షేత్రసహాయకులకు అవగాహన కల్పించారు.

## తిరుపతి ఘటనపై ఎమ్మెల్యే యార్లగడ్డ దిగ్భ్రాంతి



గన్నవరం (చైతన్యరథం): వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. అస్వస్థతకు గురైన వారికి రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందని తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా యార్లగడ్డ సూచించారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి : ఎంపీ పుట్టా మహేష్

● టెలికం సలహా కమిటీ సమావేశంలో బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్‌కు సూచన



ఏలూరు (చైతన్యరథం): బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. ఏలూరు జి.ఎస్.టి రోడ్‌లో గల బీఎస్ఎన్ఎల్ భవన్‌లో గురువారం జరిగిన టెలికం సలహా కమిటీ సమావేశానికి ఎంపీ మహేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలను జనరల్ మేనేజర్ శ్రీను వివరించారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్ పార్లమెంట్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బిఎస్ఎన్ఎల్ టవర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలవరం నియోజకవర్గంలో కొత్త టవర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు. సిబ్బంది కొరత వల్ల కొన్నిచోట్ల ఇబ్బందులు ఉన్నాయని బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ శ్రీను ఎంపీ మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగుల ఖాళీల వివరాలు, ఇతరత్రా సమస్యలు తనకు నివేదిక రూపంలో అందిస్తే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కొత్త టవర్ల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సలహా కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని ఎంపీ సూచించారు.

## అమలాపురం టు హైదరాబాద్ స్పెషల్ బస్‌లు సిద్ధం




అమలాపురం (చైతన్యరథం): నేటి నుండి 12వ తేదీ వరకు హైదరాబాద్ నుండి అమలాపురం వచ్చేందుకు 97 సర్వీసులు అదనంగా ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ రోజుల్లో 12 బస్సు సర్వీసులు నడపగా సంక్రాంతి సందర్భంగా 85 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. మరలా తీరుగు ప్రయాణం కోసం 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అమలాపురం నుండి హైదరాబాద్‌కు 220 బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా.. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆర్టీసీ హైదరాబాద్ నుండి అమలాపురం వచ్చేందుకు స్పెషల్ బస్సులు సిద్ధం చేసింది. సంక్రాంతి పండుగ అనగానే కోనసీమకు క్యూ కడతారు ఇతర రాష్ట్రాలలో ఉండే అందరూ సొంత ఊర్లకు పయనమవుతారు ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి కోనసీమకు వచ్చే ప్రయాణికుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నియమించారు. అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి 217 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ సత్యనారాయణ వెల్లడించారు. ఎటువంటి అదనపు టికెట్ ధరలు పెంచకుండా సాధారణ రోజుల్లో అమలు చేసే రెట్లలోనే టిక్కెట్ ధరలు వుంటాయని చెప్పారు.హైదరాబాదులో అన్ని రూట్లో ఆర్టీసీ బస్సులు అందుబాటులు ఉంటాయని అలాగే శంషాబాద్ ఎయిర్పోర్ట్ వద్ద నుంచి కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరం అయితే మరిన్ని బస్సు సర్వీసులు పెంచేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉంది అన్నారు. అమలాపురం టు హైదారాబాద్ తోపాటు విశాఖ, విజయవాడ అనేక రూట్లలో ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని అని ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకోవాలని అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ సూచించారు.

## తిరుపతి ఘటనపై వైసీపీ రాజకీయం చేయడం తగదు : పాతర్ల



తిరుపతి (చైతన్యరథం): తిరుమలలో జరిగిన ఘటనపై జగన్ రాజకీయం చేయడం దుర్మార్గమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. అమరావతిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తిరుమలలో వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారిని దర్శించుకోవాలని భక్తులు టోకెన్ల కోసం క్యూలో నిలబడగా తోపులాట జరిగి ఆరుగురు భక్తులు చనిపోవడం బాధాకరమని అన్నారు. ఈ ఘటనపై జగన్ రాజకీయం చేయడం దుర్మార్గమని, తిరుపతి ఘటన పైన వైసిపి నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. నిజానిజాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని, తిరుపతిలో జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రివర్గం తిరుపతి చేరుకుని ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. గాయపడిన వారిని ఆసుపత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై ప్రత్యేక విచారణ చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారని, ఘటనకు సంబంధించి అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. మృతి చెందిన భక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## పల్నాడు జిల్లా అభివృద్ధికి ఎంపీ లావు కృషి : ఎం. దారునాయక్



పల్నాడు (చైతన్యరథం): పల్నాడు జిల్లాను ప్రగతిపథంలో తీసుకువెళ్తున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులును టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారు నాయక్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దారునాయక్ మాట్లాడుతూ... ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు వెనుకబడిన పల్నాడు జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు దావుపల్లి-నాగార్జున సాగర్, కొండమోడు-పేరేచర్ల నేషనల్ హైవేలను తీసుకురావడంలో ఎంపీ కృషి ఎనలేనిదన్నారు. అలాగే పిడుగురాళ్లలో మెడికల్ ఆసుపత్రి, తాళ్లపల్లిలో కేంద్రీయ విశ్వ విద్యాలయం, నాగార్జునసాగర్‌లో నూతన విమానాశ్రయంతో పాటు పల్నాడు ప్రజల దశాబ్దాల కళ వరికపూడి సెల్ ప్రాజెక్టును తీసుకురావడంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన కృషిని ఆయన అభినందించారు.

# దేశానికే తలమానికం... చిలకలూరిపేట బైపాస్ నిర్మాణం

**●ప్రధాని మోదీ జాతికి అంకితం చేయడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణం : ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): దేశంలో ఎక్కడాలేని విధంగా చిలకలూరిపేట బైపాస్ నిర్మాణం జరిగిందని, కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వ సహాయసహాకారాలతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన మొట్టమొదటి జాతీయ రహదారిగా నిలిచిందని, నియోజకవర్గానికే మణిహారంగా నిలిచిన బైపాస్‌ను స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేయడం రాష్ట్రప్రజలకే గర్వకారణమని మాజీ మంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ట్రాఫిక్ సమస్యతో పాటు, చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారుల కష్టాల పరిష్కారం కోసం 2014లోనే టీడీపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నో ఏళ్లుగా చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలతో పాటు, చెన్నై–కోల్ కతా జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారుల కష్టాలకు చెక్ పెట్టాలని, విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ సమస్యను సరిదిద్దాలన్న సదుద్దేశంలో భాగంగా 2014లో నాటి టీడీపీ ప్రభుత్వం బైపాస్ విస్తీర్ణానికి నడుం బిగించింది.

అప్పటికే 4 వరసలుగా ఉన్న జాతీయ రహదారిని 6 వరసలకు పెంచాలన్న ప్రతిపాదనను నాటి కేంద్రప్రభుత్వం ముందు ఉంచింది. రహదారి వెడల్పుతో ఒనగూరే ప్రయోజనాలను కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖకు, జాతీయ రహదారుల విభాగానికి అర్థమయ్యేలా తెలియచెప్పింది. దురదృష్టవశాత్తూ 2019లో వైసీపీప్రభుత్వం ఏర్పడటంతో, రహదారి పనులకు బ్రేక్ పడింది. బైపాస్‌ను పూర్తిచేయాలన్న ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యమివ్వకుండా, టీడీపీ ప్రభుత్వానికి.. చంద్రబాబుకి పేరు వస్తుందనే దురాలోచనకు ప్రాధాన్యమిచ్చిన జగన్ సర్కార్ రహదారి పనులకు మోకాలడ్డింది. కూటమి ప్రభుత్వం రాకతో యుద్ధప్రాతిపదికన బైపాస్ విస్తరణ పనులు మొదలు పెట్టింది. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన 6 నెలల్లోనే జాతీయ రహదారి విస్తరణ పనులు యుద్ధప్రాతిపదికన సాగాయి. రాష్ట్రంలో గత పాలకులు వల్ల ఏర్పడిన అవాంతరాలు, ఆటంకాలు దాటి ఎట్టకేలకు దేశం గర్వించే స్థాయిలో చిలకలూరిపేట ప్రజల స్వప్నం సాకారమైంది. దశాబ్దాల తరబడి ప్రజలు అనుభవించిన ట్రాఫిక్ సమస్యలకు కాలం చెల్లింది. బుధవారం సాయంత్రం సాగరతీరాన, అశేష ప్రజానీకం సమక్షంలో సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా చిలకలూరిపేట బైపాస్ జాతికి అంకితం చేయబడిందని పుల్లారావు వెల్లడించారు.

# మానవత్వం మరిచి విషాద ఘటనపై క్షుద్ర రాజకీయమా?: చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): తిరుమలలో జరిగిన విషాద ఘటనపై మానవత్వం మరిచి విపక్ష నేత జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు క్షుద్ర రాజకీయం చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. శవం కనిపిస్తే చాలు రాబందులా వాలిపోవడం ఒకటే అతడికి తెలిసిన రాజకీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్థమాతో బాధపడుతున్న ఒక మహిళ ప్రాణం కాపాడాలని గేట్లు తెరిచిన సమయంలో దురదృష్టవశాత్తు చోటుచేసుకున్న తొక్కిసలాటను చిలువలు పలువుగా చేసి, రాజకీయ స్వార్థం కోసం రాద్ధాంతం చేయడం జగన్‌కు తగదని హితవు పలికారు. జరిగిన దుర్ఘటన అందర్నీ కలచి వేసిందని, అటు తితిదే, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా వేగంగా స్పందించి చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాలకు పరిహారం కూడా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తిరుమల తొక్కిసలాటకు సంబంధించి గురువారం విడుదల చేసిన ప్రకటనలో వైకాపా, జగన్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు. స్వల్ప వ్యవధిలోనే ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కూడా తిరుపతికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారని, తిరుమలలో ఎలాంటి ప్రమాదాలు, అవాంఛిత ఘటనలు జరగకూడదనే ప్రభుత్వం, తితిదే ఆలోచనగా చెప్పిన జీవీ జగన్ శవ రాజకీయాలు మాత్రం మానుకోవాలని సూచించారు. జగన్, వైపాకా నేతల స్పందనలో బాధితులపై పట్టింపు కంటే రాజకీయంగా బురదజల్లాలన్నదే వారి ఉద్దేశంగా కనిపిస్తోందని వాపోయారు. ఊహాగానాలు, దుష్ప్రచారాలు కాకుండా విషాదానికి దారి తీసిన వాస్తవ పరిస్థితులను ప్రత్యక్ష సాక్షుల ద్వారా కూడా సీఎం చంద్రబాబు తెలుసుకున్నారని జీవీ ఆంజనేయులు తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు.

# మంగళగిరిలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

**● స్థానిక నాయకులతో పంపిణీ చేయించిన మంత్రి నారా లోకేష్**

మంగళగిరి (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ నాయకులు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. మంగళగిరి పట్టణంలోని 23వ వార్డుకు చెందిన దాసరి కళావతికి రూ.97,196, 15వ వార్డుకు చెందిన బాదంగంటి కార్తీక్‌కు రూ.53,400, ఎన్.సి.సి రోడ్డుకు చెందిన శిరందాస్ యోగ ప్రియాకు రూ.44,406, వెజిటబుల్ మార్కెట్‌కు చెందిన పూజల బాలయ్యకు రూ.30,786, మార్కొండేయకాలనీకి చెందిన పందేటి తిరపతయ్యకు రూ.27,941, షేక్ నసీమకు రూ.30,786, ద్వారకానగర్‌కు చెందిన తిరుమలశెట్టి రాఘవేంద్రకు రూ.25,350 విలువైన చెక్కులను టీడీపీ నాయకులు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తమను అదుకున్నందుకు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా చితికిపోయిన తమకు ముఖ్యమంత్రి సహయనిధి చేయూతనిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ కమిటీ సభ్యులు కొదమల సైమన్, కారంపూడి చిరంజీవి, నక్కా రాజశేఖర్, 18వ వార్డు అధ్యక్షులు దామర్ల రాంబాబు, 10వ వార్డు అధ్యక్షులు కౌతరపు శ్రీను, ప్రధాన కార్యదర్శి వంగర హనుమాన్, 23వ వార్డు అధ్యక్షులు నూతక్కి మోహన్, ప్రధాన కార్యదర్శి యెడ్లూరి చిరంజీవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఊట్ల కనకదుర్గమల్లేశ్వరి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, మాజీ కౌన్సిలర్ దామర్ల పద్మజ, 25వ వార్డు ప్రధాన కార్యదర్శి పాగోలు శంకర్, గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ సభ్యులు మద్దిరాల రమేష్ బాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి రాయపాటి విజయ్, షేక్ అన్వర్, మాచర్ల శ్రీను, షేక్ సుభానీ(గల్ఫ్), గజ్జల వెంకటరమణ, చందోలు కిరణ్, అందే మురళీ, బుల్లా రాము, రావూరి విజయనంద్, బచ్చుల హనక్, నూతక్కి జోసఫ్, నిడమనూరి రవి, సంకూరు నాగభూషణం, తమ్మిశెట్టి హరికృష్ణ, కౌతరపు శ్రీను, చెరుకు పూర్ణ, గంజి మల్లేశ్వరరావు, ఉడతా లావణ్య, బిట్రా మాధురి, గోరంట్ల లావణ్య, తిరుమలశెట్టి వేణు, మాతంగి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# మోడ్రన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం :బొండా ఉమామహేశ్వరరావు

**● రూ.120 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు**

**● నియోజకవర్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు పనులు వేగవంతం**

**● వైసీపీ ప్రభుత్వం మాటలు చెప్పిందే తప్పా... అభివృద్ధి చేసిందే లేదు**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడ్రన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో రూ.120 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గురువారం ఉదయం 24వ డివిజన్ రెడ్ సర్కిల్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను రూ.2కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన శిలాపలకాన్ని ఆవిష్కరించి పూజలు చేశారు. అనంతరం బొండా ఉమా మీడియాతో మాట్లాడుతూ... 2024లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోకుండా నిర్లక్ష్యానికి గురైన పనులు రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, పార్కులు, స్మశానవాటికలు, స్కూల్స్ ఇలా అన్నింటిని అభివృద్ధి చేశామన్నారు. గిరిపురం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యతో 20,000 మంది కుటుంబాలకు పైగా ఇబ్బందులు కలుగుతున్నాయని, ఈ సమస్యకు పరిష్కారం కోసం రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఏ డివిజన్‌లో ఏ సమస్య ఉందో నాకు తెలుసునని, గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుక్కల అనిత, గాజుల రవి, గడ్డం రాజు, దామర్ల రామ్మూర్తి, మంద వెంకన్న, ఆశీర్వాదం, గాజుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి రాకతో వేగంగా అభివృద్ధి పనులు

**● కేంద్రమంత్రి పెమ్మసాని చొరవతో పెండింగ్ పనులకు మోక్షం**

**● పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గళ్లా మాధవి శంకుస్థాపన**



గుంటూరు (చైతన్యరథం): ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటంతో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. గురువారం గుంటూరు 28వ డివిజన్‌లోని సీతమ్మ కాలనీ మెయిన్ రోడ్డులో రూ.94 లక్షలతో 695 మీటర్ల సీసీ రోడ్డు అండ్ అప్రోచ్ నిర్మాణాలకు మాధవి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ... పశ్చిమ నియోజకవర్గ నలుమూలల కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, నియోజకవర్గంలో అభివృద్ధి అనే మాటకు, గత వైసీపీ ప్రభుత్వం పాతర వేసిందన్నారు. ప్రధాన రహదారులు గుంతలమయం అయ్యాయని, కనీసం గడిచిన 5ఏళ్ల కాలంలో వీటిని పూడ్చకుండా ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఎక్కడ కూడా గుంతలు లేకుండా చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామని, కొన్ని చోట్ల ప్యాచ్ వర్కు పనులు, అవసరమైన చోట్ల బీటీ రోడ్లు, సీసీ రోడ్ల పనులు ఇప్పటికే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చామన్నారు. నియోజకవర్గంలో అన్ని చోట్ల రోడ్లు, డ్రైన్లు పూర్తి చేసి, ఇంటింటికీ సురక్షిత మంచినీటిని అందిస్తామన్నారు. త్వరలోనే గుంటూరు పశ్చిమ నియోజకవర్గమును మౌళిక వసతుల కల్పనలో నెంబర్ 1గా చేసి తీరుతామని ఎమ్మెల్యే గళ్లా మాధవి ధీమా వ్యక్తం చేశారు. ఈ సీసీ రోడ్డు, అప్రోచ్‌ల నిర్మాణాలను నెల రోజుల లోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో ఇప్పటికే శంకర్ విలాస్ బ్రిడ్జి, గడ్డిపాడు రైల్వే ఆర్.ఓ.బీకి నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే శ్యామల నగర్ ఆర్.యూ.బికి కూడా నిధులు మంజూరు అవుతాయన్న ఆశాభావాన్ని ఎమ్మెల్యే గళ్లా మాధవి వ్యక్తం చేశారు.



# కబ్జా చేసిన ప్లాట్ల వివరాలు ఇవ్వండి

**◆అధికారులకు ఎమ్మెల్యే బొజ్జల ఆదేశం**

**◆హౌసింగ్ లేఔట్ అక్రమాలపై విచారణ**

శ్రీకాళహస్తి (చైతన్యరథం): వైసీపీ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసిన అవినీతిని ప్రజలు ముందు ఉంచుతానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. నాటి జగనన్న హౌసింగ్ లేఔట్ అక్రమాలపై గురువారం ఎమ్మెల్యే బొజ్జల అధికారులతో కలసి విచారణ చేపట్టారు. పట్టాలు ఇచ్చినట్టు చూపించి కబ్జా చేసిన ఫ్లాట్ల వివరాలను నివేదిక రూపంలో అందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రూ.250 కోట్లతో భూసేకరణ చేయగా అందులో 100 కోట్లు మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తీసుకోవడం గమనార్హమని ఎమ్మెల్యే అన్నారు. రోడ్డు ఏర్పాటుకు రూ.2 కోట్లు , విద్యుత్ కోసం రూ.5 కోట్లు వైసీపీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. కొందరు మహిళలు వచ్చి మాకు పట్టా ఇచ్చారు గాని ఫ్లాట్ చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారన్నారు . ఈ లేఔట్‌పై విచారణ జరిపించి పూర్తిస్థాయి నివేదిక అందించాలని అధికారులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, హౌసింగ్ శాఖచ,, లబ్ధిదారులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

**◆పాత్రికేయులకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పిలుపు**

**◆బాపట్ల జిల్లా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ**



బాపట్ల (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారానికి కలసి కృషి చేద్దామని పాత్రికేయులకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పిలుపునిచ్చారు. బాపట్ల పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో గురువారం బాపట్ల జిల్లా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ జిల్లాలో పాత్రికేయులు ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. ప్రజాప్రతినిధులపై దూషణలకు వెళ్లకుండా పేద ప్రజల సమస్యలపై పాత్రికేయులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. జిల్లాలో పాత్రికేయుల సంక్షేమానికి తమ వంతు సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి,తాసిల్దార్ షాలిమా, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నరాలశెట్టి ప్రకాష్‌రావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాం ప్రసాద్, బాపట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి సురేష్, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.





# సీసీ రోడ్ల పనులు ప్రారంభం

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్, కళ్యాణ్ నగర్‌లో 18 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ల పనులను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక జాతరలా సాగుతున్నాయని తెలిపారు. టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశామంటే ఆ పని ఖచ్చితంగా పూర్తికావలసిందేనన్నారు. స్థానిక ప్రజల అభ్యర్థనల మేరకే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జీ కనుపర్తి గంగాధర్, స్థానిక కార్పొరేటర్ దుద్దుగుంట (ఒరిస్సా) శ్రీనివాసులు రెడ్డి, మేకల మధు, పామూరు సుధాకర్ రెడ్డి, పుల్లా రెడ్డి, చల్లా సుబ్బన్న, పామూరు మస్తాన్ రెడ్డి, అబ్బు వెంకట రమణ, మల్లికార్జున, బాబ్జి, రమణయ్య, మురళి రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వెంకట రమణయ్య, డి.ఆర్., హరి బాబు, జిలల్, శేషయ్య, బీ.జే.పీ. నాయకులు యరబోలు రాజేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**అన్న క్యాంటీన్లను పరిశీలించిన గిరిధర్‌రెడ్డి**

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని మద్రాస్ బస్టాండ్, కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌లను టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు కూడా ఆకలితో ఉండకూడదని రాష్ట్రమంతటా అన్నా క్యాంటీన్ లను ప్రారంభించి, 5 రూపాయలకే నాణ్యమైన ఆహారాన్ని మూడుపూటల అందించే గొప్ప కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పున:ప్రారంభించారని తెలిపారు. మద్రాసు బస్టాండ్ కూరగాయల మార్కెట్‌కు జిల్లా నలుమూల నుంచి నిత్యం ప్రజలు వస్తుంటారని తెలిపారు. వారందరికీ అన్నా క్యాంటీన్ ద్వారా అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆహారం సరఫరా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శేషగిరిరావు, క్లస్టర్ ఇంచార్జీ జలదంకి సుధాకర్, టీడీపీ నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

**◆ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపు**

శ్రీకాళహస్తి (చైతన్యరథం): ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం గుంటక్రిందపల్లి గ్రామంలో గురువారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జయప్రకాష్, దేవా, మల్లీశ్వరి, సేవ్ ఆక్సిజన్ సభ్యులు లోకేష్, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



**తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల క్యూలైన్ల వద్ద గాయపడి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భక్తులను పరామర్శిస్తున్న టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు జి నరసింహ యాదవ్, కూటమి నేతలు**



# ముక్కోటి ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి గురువారం నగరంలోని పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు. నవాబుపేట ధర్మరాజస్వామి ఆలయం, రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి ఆలయం, నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

# యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికే జాబ్‌మేళా

◆యువత లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలి

◆మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టీకరణ

◆జాబ్‌మేళాకు విశేష స్పందన



ధర్మవరం (చైతన్యరథం): నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో భారీగా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు, ప్రతిఒక్కరూ ఉద్యోగంలో చేరి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి సేవా సంస్థ సౌజన్యంతో స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా ధర్మవరంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాలో పాల్గొన్న యువతీ యువకులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు రాలేక పోయినందుకు బాధ పడుతున్నానన్నారు. తిరుపతిలో జరిగిన ఘటన గురించి ఫోన్‌లో వివరించారు. ఒక వ్యక్తి ఉద్యోగం పొందాలంటే ఎక్కడికో వెళ్లి అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కోవాలని, ఈ జాబ్ మేళాలో అటువంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగం పొందవచ్చన్నారు. ప్రస్తుతం మీకు తక్కువ జీతమని నిరుత్సాహం చెందకుండా ఉద్యోగంలో చేరాలన్నారు. తర్వాత మీ నైపుణ్యాన్నిబట్టి జీతం పెరుగుతుందన్నారు. యువతీ యువకులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని మంత్రి సత్యకుమార్ అభినందనలు తెలిపారు.

అనంతరం మంత్రి కార్యాలయం ఇన్చార్జి హరీష్ బాబు మాట్లాడుతూ, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆధ్వర్యంలో ఆయన కుమార్తె సంస్కృతి పేరు మీద ఉన్న సాంస్కృతి స్వచ్ఛంద సేవ సంస్థ ట్రస్ట్ ద్వారా ధర్మవరం నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకుల అందరికీ కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ జాబ్ మేళాకు నియోజకవర్గ వ్యాప్తంగా 5121 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలో పాల్గొనగా వారిలో 1668 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు దాదాపు 99 కంపెనీలు హాజరయ్యాయని, ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో 99 కంపెనీల ప్రతినిధులు యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు.

# రాప్తాడు నియోజకవర్గంలో చురుగ్గా రోడ్డు పనులు

◆ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టీకరణ

◆రోడ్ల పనులు పరిశీలించిన ఎమ్మెల్యే, యువ నేత పరిటాల శ్రీరామ్



రాప్తాడు (చైతన్యరథం): రాప్తాడు నియోజకవర్గంలో రోడ్ల సమస్యలు లేకుండా పనులు చేపట్టామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం, నసనకోట పంచాయతీ, ముత్యాలంపల్లి గ్రామం నుంచి వెంకటాపురం వరకు జరుగుతున్న పనుల్ని పరిటాల శ్రీరామ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. సుమారు నాలుగున్నర కిలోమీటర్ల మేర ఉన్న ఈ మార్గంలో రూ.75 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు పనుల్ని చేపట్టారు. ఇప్పటికే పనులు దాదాపుగా పూర్తైన నేపథ్యంలో రోడ్డు నాణ్యతను వారు పరిశీలించారు. అలాగే ముత్యాలంపల్లి గ్రామంలో దివంగత పరిటాల రవీంద్ర నిర్మించిన కమ్యూనిటీ భవనానికి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దన్నారు. ఎగువపల్లి నుంచి పి.ఆర్.కొట్టాల వరకు ఉన్న రోడ్డు మరమ్మతులకు గురైన నేపథ్యంలో దాదాపు రూ.2.70 కోట్లతో త్వరలోనే నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే సునీత, పరిటాల శ్రీరామ్ తెలిపారు. పేరూరు ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న చెరువును వారిరువురు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. బోయలు, కురుబలు, ముస్లింలు, బలిజలు తమ ఆరాధ్యంగా ఉన్న వాల్మీకి, కనకదాసు, టిప్పు సుల్తాన్, శ్రీకృష్ణదేవరాయలు, అంబేద్కర్ విగ్రహాల్ని ఏర్పాటు చేయాలని వారిని కోరారు. అలాగే పార్క్ తరహాలో అభివృద్ధి చేస్తే చిన్న పాటి పర్యాటక కేంద్రంగా ఉంటుందన్నారు. దీనిపై పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే సునీత సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గత ఐదేళ్లుగా గ్రామాల్లో రోడ్ల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రాంతాల్లో రోడ్లకు మోక్షం వచ్చిందన్నారు. ఇప్పటికే రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఇంకా చాలా ప్రాంతాల్లో రోడ్లు వేయాల్సి ఉందని, ప్రాధాన్యత వారిగా పనులు చేపడతామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

# 11న వడ్డే ఓబన్న జయంతి

◆రాష్ట్ర పండుగగా గుర్తించిన ప్రభుత్వం

◆ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ

◆సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి




పుట్టపర్తి (చైతన్యరథం): రాష్ట్రంలో లక్షలాది జనాభా కలిగిన వడ్డెర్ల ఆరాధ్య దైవం, తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వేడుకగా ప్రకటించినందుకు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర్ల ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న జయంతి జనవరి 11న రాష్ట్ర పండుగగా నిర్వహించాలని గత ఏడాది నవంబర్ 19న అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వడ్డెర్లకు మద్దతుగా ప్రస్తావించారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం వేగంగా స్పందించింది. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు సత్వరమే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత,కూటమి ప్రభుత్వ ఉన్నతాధికారులు వేగంగా అడుగులు వేసి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వం జీఓ నెంబర్ 05 ను విడుదల చేసి జనవరి 11 న అన్ని జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా జరపాలని ఈ నెల 8వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. అడిగిన వెంటనే 50 రోజుల్లోనే వడ్డెర మనోభావాలు గుర్తించి జీవో జారీ చేయడానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ ,మంత్రి సవిత కు , పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి రాష్ట్ర వడ్డెర కులస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులకు రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



# గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకుంటాం

◆మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత భరోసా

◆ప్రమాదంపై మంత్రుల విచారం



బత్తలపల్లి (చైతన్యరథం): సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం కోడేకండ్ల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి ఓబులపతి తీవ్రంగా గాయపడగా, 13 గొర్రెలు మృతి చెందడం పట్ల రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖామంత్రి అచ్చెన్నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన గురించి మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా పశుసంవర్ధక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల కాపరి ఓబులపతి కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. గొర్రెల కాపరి ఓబులపతి కుటుంబానికి నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా గొర్రెల కొనుగోలుకు రాయితీపై రుణం అందించేందుకు అవకాశాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రన్న బీమా, ప్రమాద బీమా బాధిత కుటుంబానికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

**బాధితుడికి అండగా ఉంటాం: మంత్రి సవిత**



సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం కోడేకొండ్ల రామాపురం వద్దవ్యాన్ ఢీకొట్టడంతో 14 గొర్రెలు మృతి చెందగా, గొర్రెల కాపరి తీవ్రంగా గాయపడిన ఘటనపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, పశు సంవర్ధక శాఖ జేడీ సుభదాస్‌తోను మంత్రి సవిత ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాద ఘటనపై నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. క్షతగాత్రుడు ఓబులపతి కుటుంబ సభ్యులతోనూ మంత్రి సవిత ఫోన్‌లో మాట్లాడారు. అండగా ఉంటామని, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.








# రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నేత మంచూరు శాశ్వత సభ్యత్వం స్వీకరణ

◆మంచూరును అభినందించిన రితీష్‌రెడ్డి

బద్వేల్ (చైతన్యరథం): బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త, యువ నాయకుడు రితీష్ రెడ్డి సమక్షంలో గురువారం బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు మంచూరు సూర్యనారాయణ రెడ్డి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా నియోజవర్గ సమన్వయకర్త రితీష్‌రెడ్డి, మంచూరు సూర్యనారాయణరెడ్డిని అభినందించారు. తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు సూర్యనారాయణరెడ్డి, అట్లూరు మండల సీనియర్ నాయకులు నందగోపాల్ రెడ్డి, అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించడానికి నియోజకవర్గ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి చేస్తున్న కృషి అమోఘమన్నారు. అదేవిధంగా శాశ్వత సభ్యత్వం తీసుకున్న తర్వాత బాధ్యత మరింత పెరిగిందని, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని మంచూరు స్పష్టం చేశారు.

# భారత్ నిపుణులైన యువకుల దేశం

◆భారత్‌కు 'విశ్వబంధు'గా గుర్తింపు

◆ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంస

భువనేశ్వర్: భారత్ కేవలం యువ దేశమే కాదు.. నిపుణులైన యువకుల దేశం. భారత్‌కు 'విశ్వబంధు'గా గుర్తింపు ఉంది. దానిని మరింత బలోపేతం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దినోత్సవ కార్యక్రమంలో మోదీ పాల్గొని ప్రసంగించారు. ఒడిశాలో అడుగడుగునా వారసత్వం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి వ్యాపారులు సుమత్ర, బాలి, జావా వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. "భారత్ ప్రజాస్వామ్యానికి కేవలం తల్లి లాంటిది మాత్రమే కాదు.. అది మన జీవితాల్లో భాగం. విదేశాల్లో జీవించేవారు భారత్‌కు రాయబారులుగా నేను చూస్తాను. భారత్ నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జీ20 సందర్భంగా దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేశాం. మన వారసత్వ, విభిన్న సంస్కృతులను ప్రపంచం గమనిస్తోంది. భారత్ స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాసులు కూడా తోడ్పడ్డారు.ప్రవాస భారతీయులు వచ్చే ఏడాది ఈ ఉత్సవానికి వచ్చే సమయంలో కనీసం ఐదుగురు విదేశీ మిత్రులను తమతోపాటు తీసుకురండి." అని ప్రధాని మోదీ ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు.

మహాకుంభ్, సంక్రాంతి, లోహిరి, మాఘ్ బిహు వంటి పండుగల సీజన్‌లో ప్రవాస భారతీయ వేడుకలు జరగడం విశేషమన్నారు.



ఈసందర్భంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షుడు క్రిస్టీనే కార్ల వీడియో సందేశం పంపించారు. ఆమె భారత్ పురోగతిని కొనియాడారు.

రష్యా, ఇజ్రాయెల్ పేర్లను నేరుగా ప్రస్తావించకుండా భవిష్యత్తు యుద్ధంలో కాదని.. బుద్ధుడిలో ఉందని పేర్కొన్నారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు అవకాశం ఉన్నా.. బౌద్ధం స్వీకరించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఒడిశా సీఎం మోహన్చరణ్ మాఝీ తదితరులు పాల్గొన్నారు.

**ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ**

విదేశీ భారతీయుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ఈ రైలును వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎన్ఆర్ఐ టూరిస్టుల కోసం ఈ రైలును ప్రారంభించారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. మూడు వారాల ప్రయాణం ఉంటుంది. దేశంలోని పలు సంప్రదాయ, మతపరమైన ప్రదేశాలను ఆ రైలు చుట్టివస్తుంది.

ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ కింద ప్రత్యేక టూరిస్టు రైలును రూపొందించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం ఈ టూరిస్టు రైలు ఏర్పాటు చేశారు. 45 నుంచి 65 ఏళ్ల మధ్య ఉన్నవారు ఈ రైలులో ప్రయాణం చేయవచ్చు. తమ చారిత్రాత్మక మూలాలను టచ్ చేసే రీతిలో ఈ రైలు రూట్‌ను క్రియేట్ ఛేవారు.

ఢిల్లీ నుంచి బయలుదేరిన రైలు.. ఆ తర్వాత అయోధ్య చేరుకుంటుంది. అక్కడ నుంచి పాట్నా, గయా, వారణాసి, మహాబలిపురం, రామేశ్వరం, మధురై, కొచ్చి, గోవా, ఏక్తా నగర్(కేవడియా), అజ్మీర్, పుష్కర్, ఆగ్రా పట్టణాలను ఆ రైలు చుట్టువస్తుంది. ఈ రైలులో 156 మంది ప్రయాణికుల ట్రావెల్ చేసే అవకాశం ఉంటుంది. విదేశాంగ శాఖ, భారతీయ రైల్వే, ఐఆర్‌సీటీసీ కలిసి .. ప్రవాసీ రైలును ప్రారంభించారు. వివిధ దేశాల్లోని భారతీయ ఎంబసీల నుంచి ఈ రైలు ప్రయాణికుల కోసం దరఖాస్తు చేశారు. తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నారు.

విదేశాంగ శాఖ ప్రకారం.. రైలు టూరుకు చెందిన అన్ని ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఆయా దేశాల నుంచి ఇండియాకు వచ్చే ప్రవాసీల రిటర్న్ విమాన ఖర్చులో 90 శాతం కూడా ప్రభుత్వమే పెట్టుకోనున్నది. ప్రయాణికులు కేవలం 10 శాతం ఛార్జీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైలులో టూర్ చేసే వారికి 4స్టార్ హోటల్ అకామిడేషన్ ఇవ్వనున్నారు. రైలు ఆవిష్కరణ గురించి మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ ట్వీట్ చేశారు.



## ఈ నెలలోనే ఉమ్మడి పౌర స్మృతి అమలు

◆ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పష్టీకరణ

బరేలీ: ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈనెల నుంచే ఉమ్మడి పౌరస్మృతి అమలు కానున్నది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. యూపీలోని బరేలీలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. 29వ ఉత్తరయాని మేళాను సీఎం ధామి ప్రారంభించారు. 2024, ఫిబ్రవరి ఏడవ తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌర స్మృతి బిల్లును పాస్ చేసింది. ఆ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం వెంటనే దక్కింది. ఆ తర్వాత మార్చి 12, 2024లో నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని రూపొందించారు. జనవరి 2025 నుంచి ఆ చట్టాన్ని పూర్తిగా అమలు చేయనున్నట్లు చెప్పారు. యూసీసీ అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ డెవలప్ చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలోనే తెలిపారు.

## అలా అయితే.. ఇంకెందుకు 'ఇండియా' కూటమి?

◆జమ్మూ కాశ్మీర్ సీఎం

ఒమర్ అబ్దుల్లా ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విపక్ష 'ఇండియా' కూటమిని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కూటమిలో భాగమైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య విభేదాలు తలెత్తడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. దీంతో ప్రతిపక్షాల ఐక్యతను సీఎం ప్రశ్నించారు. కలసికట్టుగా లేనందున కూటమికి ముగింపు పలకాలంటూ వ్యాఖ్యానించారు.

**కూటమి భవిష్యత్తు ఏమిటి?**

"కేంద్రంలోని ఎన్డీయే సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పడిన విపక్ష 'ఇండియా' కూటమికి సంబంధించి ప్రస్తుతం ఏ సమావేశం జరగకపోవడం బాధాకరం. ఇప్పుడు ఈ కూటమికి ఎవరు నేతృత్వం వహిస్తారు..? దీని అజెండా ఏమిటి..? అసలు కూటమి ఎలా ముందుకు సాగుతుంది..? ఈ అంశాలపై చర్చలే జరగడం లేదు. 2024 ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజార్టీ రాకుండా చేసేందుకు శక్తికి మించి కృషి చేసినా ఈ కూటమి భవిష్యత్తుపై ఇప్పుడు స్పష్టత లేకుండాపోయింది. మనమంతా ఐక్యంగా ఉంటామా, లేదా అనే విషయంపై స్పష్టత లేదు" అని ఒమర్ అబ్దుల్లా అసహనం వ్యక్తం చేశారు.

**ఇక ముగింపు పలికితేనే బెటర్!**

"ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమిలోని భాగస్వామ్య పార్టీలన్నీ సమావేశం ఏర్పాటుకు సిద్ధం కావాలి. లోక్‌సభ ఎన్నికల కోసమే కూటమి ఏర్పడినట్లయితే.. ఇక పొత్తుకు స్వస్తి పలకండి. ఇండియా కూటమిని మూసేయండి. అలాకాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా విజయం సాధించాలంటే కలసికట్టుగా ఉండాలి. దీనిపై చర్చలు జరిపి ఒక స్పష్టతకు రావాలి" అని పిలుపునిచ్చారు.



ఇదిలావుండగా త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలోనే ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్, ఆప్‌లు ఒంటరి పోరుకు సిద్ధమయ్యాయి. అంతేకాకుండా ఈ రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. దీంతో లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమికి ప్రాముఖ్యం తగ్గిపోయిందంటూ కూటమి నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో స్పందించిన ఒమర్ అబ్దుల్లా.. కలిసి ఉండలేకపోతే కూటమిని మూసేస్తే సరిపోతుందంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

◆ముగ్గురు మావోయిస్టుల హతం

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. సుక్మా జిల్లాలో బీజాపూర్ సరిహద్దు వద్ద భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య గురువారం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా సిబ్బంది గురువారం ఉదయం సుక్మా–బీజాపూర్ సరిహద్దులోని అటవీప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈక్రమంలో అక్కడ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చావన్ తెలిపారు.

ఇదిలావుండగా మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడిన విషయం తెలిసిందే. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీ పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఈడీ పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. ఈ దుశ్చర్యలో 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి.



## రూ.1,033 కోట్లతో శబరిమల అభివృద్ధి

◆మాస్టర్ ప్లాన్‌కు కేరళ మంత్రివర్గం ఆమోదం

తిరువనంతపురం: కేరళలోని ప్రసిద్ధ శబరిమలను రూ.1,033.62 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను గురువారం ఆ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. సన్నిధానం, పంపా, ట్రెక్ రూట్ వంటి కీలక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి బ్లూప్రింట్ రూపొందించారు. మొత్తం రూ.778.17 కోట్ల వ్యయంతో సన్నిధానం ప్రాంతాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశ పనులకు రూ. 600.47 కోట్లు, 2028-2033 మధ్య చేపట్టనున్న రెండో దశ పనులకు రూ. 100.02 కోట్లు, 2034-39 మధ్య చేపట్టనున్న మూడో దశ పనులకు రూ.77.68 కోట్లు కేటాయించనున్నారు.

అయ్యప్ప స్వామి సన్నిధానం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతకు భంగం కలుగకుండా లేఅవుట్ ప్లాన్ రూపొందించినట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రాంతాన్ని ఎనిమిది జోన్‌లుగా విభజించినట్లు పేర్కొంది. మకరవిళక్కు (మకర జ్యోతి) దృశ్యాలు కనిపించేలా, భక్తుల రద్దీని నియంత్రించేలా రెండు ఓపెన్ ప్లాజాలు నిర్మించనున్నట్లు వెల్లడించింది.

మరోవైపు అటవీ మార్గంలో ప్రయాణించే యాత్రికుల సురక్షితం, సౌకర్యం కోసం వాహన రూట్ లేఅవుట్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ మార్గంలో పెల్లర్లు, విశ్రాంతి భవనాలు నిర్మిస్తారు. రోడ్డుకు రెండు వైపులా అత్యవసర వాహన లేన్, పర్యావరణ పునరుద్ధరణ కోసం బఫర్ జోన్‌లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ. 47.97 కోట్ల వ్యయంతో ట్రెక్ రూట్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. తొలి దశ పనులకు రూ.32.88 కోట్లు, రెండో దశ పనులకు రూ.15.50 కోట్లు కేటాయించనున్నారు.



ఇదిలావుండగా పంపా అభివృద్ధికి రూ.207.48 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు. మొదటి దశకు రూ. 184.75 కోట్లు, 2028-33 మధ్య రెండో దశ పనులకు రూ.22.73 కోట్లు కేటాయిస్తారు. శబరిమల మాస్టర్ ప్లాన్ ప్రకారం పంపా, ట్రెక్ రూట్ అభివృద్ధికి కలిపి మొత్తం రూ. 255.45 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు.

# బీరుట్ ఎయిర్‌పోర్టుపై బాంబింగ్‌కు ఇజ్రాయెల్ పథకం

ఇరాన్‌కు చెందిన ఖుడ్స్ ఫోర్స్ నుంచి హెజ్‌బొల్లాకు మిలియన్ల డాలర్లు అందకుండా చేసేందుకు ఇజ్రాయెల్ దళాలు ఏకంగా బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనే బాంబింగ్ చేసేందుకు పథకం చేశాయట. ఈ విషయాన్ని సౌదీ అరేబియా ప్రభుత్వ రంగ ఛానల్ 'అల్ అరేబియా' కథనంలో పేర్కొంది.

వాస్తవానికి గత గురువారం ఇరాన్ మిలియన్ల డాలర్ల సొమ్మును హెజ్ బొల్లాకు అందజేసేందుకు ప్లాన్ చేసినట్లు సౌదీ పత్రిక అల్ హదాత్ పేర్కొంది. టెహ్రాన్ నుంచి డబ్బు తీసుకెళ్లేందుకు 'మహన్ ఎయిర్ విమానం వినియోగించాలని వ్యూహరచన చేసింది. ఈ విషయం లెబనాన్‌కు తెలిసింది. ఆ మరుసటి రోజే కొందరు ఇరాన్ అధికారులు మహన్ ఎయిర్ ఫ్లయిట్‌లో బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యారు. వెంటనే విమానం మొత్తాన్ని భద్రతా సిబ్బంది తనిఖీ చేశారు. వారి లగేజీని చెక్ చేయడానికి లెబనాన్ భద్రతాధికారులు ప్రయత్నించగా.. ఇరాన్ అధికారులు ప్రతిఘటించారు. కానీ, లెబనాన్ సిబ్బంది మాత్రం తనిఖీలు చేసి కొన్ని అనుమానాస్పదమైనవి, సొమ్ములను స్వాధీనం చేసుకొన్నారు.



దీనిపై ఆ విమానంలో వచ్చిన ఇరాన్ దౌత్య ప్రతినిధి మాట్లాడుతూ.. తమ బ్యాగుల్లో కొన్ని పత్రాలు, ఎంబసీ నిర్వహణ ఖర్చులకు చెల్లించేందుకు సొమ్ములు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు లెబనాన్ మంత్రి బస్సమ్ మలావి మాత్రం ఆ రోజు సాయంత్రం వరకు ఎయిర్ పోర్టు నుంచి వచ్చే ప్రతిఒక్కరినీ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. నగదు లేకపోవడంతో ఎయిర్ పోర్టుపై బాంబింగ్ ప్లాన్‌ను ఇజ్రాయెల్ పక్కనపెట్టినట్లు తెలుస్తోంది.

అక్టోబర్ 2024 నుంచి లెబనాన్ ఆర్మీనే స్వయంగా బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తనిఖీలు చేస్తోంది. గతంలో ఈ ఎయిర్ పోర్టును హెజాబొల్లా ఆధీనంలో పెట్టుకొని ఆయుధాలు, నగదు స్మగ్లింగు వాడుకొంటోందని చాలా మంది రాజకీయ నాయకులు కొన్నేళ్లుగా అసంతృప్తితో ఉన్నారు.

### లెబనాన్ అధ్యక్ష ఎన్నిక

లెబనాన్ పార్లమెంట్‌లో అధ్యక్ష ఎన్నిక ప్రయత్నాలు జోరందుకొన్నాయి. మాజీ అధ్యక్షుడు మైఖేల్ ఔన్ స్థానంలో కొత్త వ్యక్తిని ఎన్నుకోవడానికి గత రెండేళ్లలో 12 సార్లు యత్నించినప్పటికీ సాధ్యపడలేదు. ప్రస్తుతం అధ్యక్ష రేసులో ఆర్మీ కమాండర్ జోసఫ్ ఔన్ ముందంజలో ఉన్నారు. అమెరికా, సౌదీకి అత్యంత సన్నిహితుడిగా అతడికి పేరుంది. ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా మధ్య జరుగుతున్న యుద్ధం నుంచి కోలుకొని దేశ పునర్నిర్మాణం చేయాలంటే అతడి ఎంపిక చాలా అవసరం ఉంది.

# నిజ్జర్ హత్య కేసులో నలుగురు భారతీయులకు బెయిల్



ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసుపై దర్యాప్తు చేపట్టిన టొరంటో పోలీసులు గతేడాది నలుగురు భారతీయులను నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేశారు. తాజాగా వారికి బెయిల్ మంజూరైంది.

నిజ్జర్ కేసులో ఫస్ట్ డిగ్రీ అభియోగాలపై కరణ్ బ్రార్, కమల్ ప్రీత్ సింగ్, కరణ్ ప్రీత్ సింగ్, అమర్దీప్ సింగ్‌ను గతేడాది మే నెలలో కెనడా పోలీసులు అరెస్టు చేశారు. భారత్‌కు చెందిన వీరిలో ముగ్గురు ఎడ్మంటర్ ప్రాంతంలో నివసిస్తుండగా.. అమర్దీప్ బ్రాంప్టన్ వాసి. గత కొన్ని నెలలుగా జైల్లో ఉన్న వీరికి కెనడాలోని దిగువ కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. అనంతరం ఈ కేసు విచారణను బ్రిటీష్ కొలంబియా సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. దీనిపై ఫిబ్రవరి 11న తదుపరి విచారణ జరగనుంది.

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023 జూన్‌లో బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటన వెనక భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ అప్పట్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. వాటిని సమర్థించే ఆధారాలు ఇవ్వాలని, ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని పలుమార్లు స్పష్టంగా చెప్పింది.

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023 జూన్‌లో బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటన వెనక భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ అప్పట్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. వాటిని సమర్థించే ఆధారాలు ఇవ్వాలని.. ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని పలుమార్లు స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ కెనడా మాత్రం ఆరోపణలు చేయడం మానలేదు. ఈక్రమంలోనే నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కూర్ వర్మ పేరును చేర్చడంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సంజయ్ వర్మ సహా ఆ దేశంలోని మన దౌత్యవేత్తలను భారత్ వెనక్కి రప్పించింది. అదే సమయంలో ఢిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలన్న నిర్ణయం తీసుకుంది. దీంతో ఒట్టావా కూడా మన దౌత్యవేత్తలపై బహిష్కరణ వేటు వేసింది.

# పాకిస్థాన్‌లో ముగ్గురు హిందువుల కిడ్నాప్

లాహోర్: పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో ముగ్గురు హిందువులను దొంగల ముఠా కిడ్నాప్ చేసింది. వారికి సంబంధించిన వ్యక్తులను విడుదల చేయకుంటే, ఆ హిందువులను చంపివేస్తామని బెదిరించారు. పంజాబ్ ప్రావిన్సులోని రహీమ్ యార్ ఖాన్ జిల్లాలోని బోంగ్ ఏరియాలో ఈ ఘటన జరిగింది.

షామన్, షమీర్, సాజన్ అనే ముగ్గురిని దొంగలు ఎత్తుకెళ్లారు. బోంగ్లోని హెల్త్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో అయిదుగురు వ్యక్తులు ఆయుధాలతో వచ్చి గన్‌పాయింట్‌లో బెదిరించి ముగ్గురు హిందువులను కచ్చా ఏరియాకు తీసుకెళ్లారు. ఆ తర్వాత రింగు లీడర్ ఆషిక్ కొరాయి ఓ వీడియోను రిలీజ్ చేశాడు. తమ కుటుంబానికి చెందిన పది మందిని రిలీజ్ చేస్తేనే, కిడ్నాప్ అయిన ముగ్గురు హిందువులను సురక్షితంగా విడుదల చేస్తామని ఆ వీడియోలో పోలీసుల్ని బెదిరించాడు.

హిందువులకు బేడీలు వేసి ఉన్నట్లు వీడియోలో చూపించారు. ఒకవేళ తమ సభ్యుల్ని విడుదల చేయకుంటే హిందువుల్ని చంపేసి, పోలీసులపై దాడులు చేయనున్నట్లు ఆ వీడియోలో హెచ్చరించారు. కచ్చా ఏరియాలో గత ఏడాది దొంగల ముఠా చేసిన దాడిలో 12 మంది పోలీసులు మృతి చెందారు, ఏడు మంది గాయపడ్డారు.

పంజాబ్, సింధు ప్రావిన్సు సరిహద్దుల్లో ఉన్న కచ్చా నదీ పరివాహక ప్రాంతంలో దొంగల ముఠా సంచరిస్తూ ఉంటుంది. చాలా శక్తివంతమైన ఆ దొంగల ముఠాలను పట్టుకునేందుకు పంజాబీ పోలీసులు ప్రయత్నాలు చేశారు. అయితే ప్రతిసారి మైనార్టీలను ఎత్తుకెళ్లి, పోలీసుల్ని బెదిరించడం వారికి అలవాటైపోయింది.

# విమానంలో ప్రియురాలితో వివాదం.. తలుపు తెరిచేందుకు యువకుడి యత్నం!

విమానంలో కొందరు ప్రయాణికులు అభ్యంతరకరంగా ప్రవర్తించడం, సిబ్బందిపై దాడి చేయడం వంటి ఘటనలు ఇటీవల తరచూ చూస్తున్నాం. తాజాగా జెట్ బ్లూ విమానంలో ఓ ప్రయాణికుడు తోటివారిని హడలెత్తించాడు. విమానం గాల్లో ఉండగానే అత్యవసర ద్వారాన్ని తెరిచేందుకు ప్రయత్నించాడు. అమెరికాలోని లారెన్స్ లోగాన్ విమానాశ్రయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.




అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్యూర్టోరికోకు చెందిన మోరెల్స్ టెర్రోస్ అనే వ్యక్తి విమానంలో తన గర్ల్ ఫ్రెండ్‌తో కలిసి ప్రయాణిస్తున్నాడు. ఆ సమయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. టెర్రోస్ ఆవేశంతో విమానం అత్యవసర ద్వారాన్ని తెరిచి దూకేందుకు యత్నించాడు. దీంతో ఒక్కసారిగా తోటి ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై అతడిని అడ్డుకున్నారు.

సమీపంలోని విమానాశ్రయంలో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. విమాన సిబ్బంది ఫిర్యాదుతో మసాచుసెట్స్ పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత నిందితుడికి బెయిల్ లభించగా.. కోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. విచారణ నిమిత్తం మసాచుసెట్స్‌కు తప్ప భవిష్యత్తులో మరే ప్రాంతానికి ప్రయాణించకూడదని పేర్కొంది. విమానంలో జరిగిన ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు విచారణ చేపట్టారు.


# లాస్ ఏంజిల్స్‌లో ఆగని కార్చిచ్చు

- ఐదుగురు మృతి
- 27 వేల ఎకరాల్లో మంటలు

లాస్ ఏంజిల్స్: అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు ఆగడం లేదు. వరుసగా రెండో రాత్రి కూడా అక్కడి అడవులు అంటుకున్నాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అయిదు ప్రదేశాల్లో దావానలం చెలరేగుతున్నట్లు అధికారులు చెప్పారు. అయితే ఈ కార్చిచ్చు వల్ల అయిదుగురు మృతి చెందారు. అయిదు చోట్ల మంటల వల్ల సుమారు 27 వేల ఎకరాల అడవి దగ్ధం అవుతున్నది. పాలిసేడ్స్, ఈటాన్ వద్ద భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. ఈ రెండు చోట్ల మంటల్ని ఆర్పడం ఇబ్బందిగా మారింది.

శాన్ ఫెర్నాండో వ్యాలీలో మాత్రం కార్చిచ్చును అదుపు చేయడంలో అగ్నిమాపక సిబ్బంది విజయవంతం అయ్యింది. ఈటాన్ సిటీలో అయిదుగురు మృతి చెందారు. నగరం నుంచి సుమారు 1.37 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రునియన్ కానియన్ వద్ద దావానలం వ్యాపించడంతో.. హాలీవుడ్ కొండల్లోని వీధులన్నీ రద్దీగా మారాయి. జనం భయంతో పరుగులు తీస్తున్నారు. అనేక మంది హాలీవుడ్ సెలబ్రిటీల ఇండ్లు కూడా దగ్ధం అయ్యాయి.

కాలిఫోర్నియాలో భారీ విపత్తు చోటుచేసుకున్నట్లు అధ్యక్షుడు బైడెన్ ప్రకటించారు. ఫెడరల్ నిధుల్ని విడుదల చేసే యోచనలో సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం కాచిన లేదా బాటిల్ నీళ్లను మాత్రమే సేవించాలని పసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంత ప్రజలకు అధికారులు సూచన చేశారు. నీటి కొరత ఏర్పడడంతో స్విమ్మింగ్ పూల్స్, చెరువుల నుంచి నీటిని తోడి మంటల్ని ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. మంటల్లో నటి పారిస్ హిల్టన్ ప్రాపర్టీ దగ్ధమైంది.



ఇదిలావుండగా అమెరికాలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తోంది. ఈ వైల్డ్‌ఫైర్ కారణంగా అమెరికాలోని సంపన్నుల నగరంగా పేరొందిన లాస్ ఏంజెల్స్ కాలి బూడిదైపోతోంది. ఈ ప్రాంతంలో హాలీవుడ్ స్టార్స్‌తోపాటు బిలియనీర్లు నివసిస్తుంటారు. దీంతో మంటల్లో ఖరీదైన ఇళ్లు, కార్లు, ఇతర వస్తువులు బూడిదవుతున్నాయి. ఈ కార్చిచ్చులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ నివాసం కూడా బూడిదైపోయినట్లు తెలిసింది. మాలిబులోని హంటర్ బైడెన్‌కు చెందిన అత్యంత విలాసవంతమైన మాన్షన్ పూర్తిగా దగ్ధమైపోయింది. ఇంటి ముందు ఉన్న ఖరీదైన కారు సైతం కాలి బూడిదైపోయింది. ఈ మాన్షన్ ఖరీదు 15,800 అమెరికా డాలర్లుగా తెలుస్తోంది. మాన్షన్ మొత్తం కాలి బూడిదైపోయిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# మీడియాపై ఇజ్రాయెల్ ఆంక్షలు!

ఇజ్రాయెల్– హమాస్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. ఈనేపథ్యంలో టెల్‌అవీవ్ కీలక నిర్ణయం తీసుకుంది. గాజాతో యుద్ధంలో పాల్గొంటున్న తమ సైనికులు విచారణను ఎదుర్కొనే అవకాశం ఉండటంతో.. మీడియాపై ఆంక్షలు విధించింది. ఇటీవల ఇజ్రాయెల్‌కు చెందిన ఓ రిజర్వ్ సైనికుడు బ్రెజిల్‌లో పర్యటించారు. కొందరు పాలస్తీనా మద్దతుదారులు అతడిని గుర్తుపట్టి ఫిర్యాదు చేశారు. దీంతో అతడిని విచారించాలని ఫెడరల్ పోలీసులను బ్రెజిల్ జడ్జి ఆదేశించారు. ఈవిషయం కాస్తా ఆ సైనికుడికి తెలియడంతో ఆకస్మికంగా దేశాన్ని వీడాడు. ఈ నేపథ్యంలోనే ఇకపై తమ సైనికుల పేర్లు. ముఖాలను పూర్తిగా చూపించకూడదని ఇజ్రాయెల్ మీడియాను ఆదేశించింది. కల్నల్ అంతకంటే తక్కువ స్థాయి సైనిక అధికారులకు ఈ నిబంధన వర్తిస్తోంది. పైలెట్లు, ఇతర విభాగ దళాలకు ఇప్పటికే పలు నిబంధనలు ఉన్నాయి.

# బీసీసీఐ సెలక్టరకు షమీ గట్టి సవాల్!

## *10 ఓవర్ల స్పెల్, 3 వికెట్లు, 61 పరుగులు*



సీనియర్ పేసర్ మహ్మద్ షమీ టీమిండి యాలో పునరాగమనానికిసై అంటున్నాడు. తాజాగా తన ప్రదర్శ నతో మరోసారి బీసీసీఐ సెలక్టరకు గట్టి సవాల్ విసిరాడు. దాదాపు 14 నెలల నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ రోజురోజుకూ మరింత ప్రమాదకరమైన బౌలర్‌గా మారిపోతున్నా డు. ఫిట్‌నె స్‌ను సాధించి ఛాంపియన్స్ ట్రోఫీకి నేను రెడీ అంటూ తన ప్రదర్శనతోనే బీసీసీఐ సెలక్టర్లకు గట్టి సవాల్ విసురుతున్నా డు. తనను కచ్చితంగా ఎంచుకుని తీరాల్సిందే అంటూ.. తన ఆటతీరుతో సెలక్టర్లకు గట్టి సందేశాన్ని పంపుతున్నాడు. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి తన అద్భుత ప్రదర్శనతో చెలరేగి ఆడాడు.

**10 ఓవర్ల స్పెల్, 3 వికెట్లు, 61 పరుగులు**

నిన్నటి వరకు షమీ ఫిట్‌నెస్‌పై ఎంతో కొంత ఆందోళన నెలకొనే ఉంది. కానీ ఇప్పుడు అది అమానుల్లో పూర్తిగా తొలిగిపోయే దిశగా వచ్చేసింది. ఎందుకంటే విజయ్ హజారే ట్రోఫీలో మళ్లీ అద్భుత ప్రదర్శనతో షమీ రెచ్చిపోయాడు. బెంగాల్ జట్టు తరఫున బరిలోకి దిగిన షమీ, హరియాణాతో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. పది ఓవర్ల స్పెల్ వేసిన అతడు 61 పరుగులు ఇచ్చాడు. అంతకుముందు రౌండ్ 7 మ్యాచ్‌లో కూడా మధ్యప్రదేశ్‌పై 42 పరుగులు చేసిన అతడు, ఎనిమిది ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీశాడు.

**మరి తీసుకుంటారా?**

టీమిండియా నెక్ట్స్ సొంతగడ్డపై ఇంగ్లాండ్ పరిమిత ఓవర్ల సిరీస్ ఆడనుంది. జనవరి 22 నుంచి ఐదు టీ20, మూడు వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ బరిలో దిగనుంది. ఈ నేపథ్యంలోనే షమీ పది ఓవర్ల కోటాను ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేసి, తానూ రేసులో ఉన్నానని సెలక్టర్లకు గట్టి సందేశం పంపించాడు. ఒకవేళ అతడిని ముందుగా ఇంగ్లాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ జట్టులోకి తీసుకుంటే, అక్కడ తానేంటో మరోసారి నిరూపించుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఐసీసీ టోర్నీలంటేనే షమీ రెచ్చి పోయి ఆడుతాడన్న సంగతి తెలిసిందే. గత వన్డే వరల్డ్ కప్ లోనూ అతడు తక్కువ మ్యాచ్‌లే ఆడినప్పటికీ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. చూడాలి మరి ఫిట్‌నెస్ విషయంలో మెరుగ్గా కనిపిస్తోన్న షమీని ఈ సారి ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తీసుకుంటారా? లేదా ? అనేది.

**బుమ్రా విషయంలో సందిగ్ధం**

మరోవైపు బుమ్రా కూడా ఛాంపియన్స్ ట్రోఫీ ఆడటంపై సందిగ్ధం నెలకొంది. అతడికి మొదటగా 15 మందితో ప్రకటించే స్క్వాడ్‌లో ఛాన్స్ దక్కినా, ఫిట్‌నెస్ ఉంటేనే తుది జట్టులో ఆడిస్తామనే బీసీసీఐ షరతు విధించినట్లు ప్రచారం సాగుతోంది.

### ఆ ఒక్కటి చేస్తే

# ఛాంపియన్స్ ట్రోఫీ స్క్వాడ్‌లో బుమ్రాకు ఛాన్స్!

వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీలో బుమ్రా ఆడతాడా? లేదా? అనే విషయం ప్రస్తుతం క్రికెట్ ప్రియుల్లో ఉత్కంఠ రేపుతోంది. అయితే తాజాగా ఈ విషయంపై భారత క్రికెట్ అభిమానులకు సంతోషం కలిగించే వార్త బయటకు వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం బుమ్రాను తీసుకునేందుకు బీసీసీఐ ఓ షరతు పెట్టిందట.

**అదేంటంటే**

రీసెంట్ గా ముగిసిన ఆస్ట్రేలియా పర్యటనలో అదిరే ప్రదర్శన చేసిన బుమ్రా 32 వికెట్లతో టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును కూడా దక్కించుకున్నాడు. కానీ, సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో వెన్ను నొప్పి కారణంగా బౌలింగ్ చేయలేదు. దీంతో మరో సారి భారత క్రికెట్‌లో జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై తీవ్ర చర్చ సాగడం మొదలైంది.

ఇప్పటికే బుమ్రా.. బీసీసీఐ మెడికల్ టీమ్‌తో కలిసి స్కానింగ్‌కు కూడా వెళ్లొచ్చాడు. కానీ, అతడి గాయం తీవ్రతపై బీసీసీఐ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే ఇంగ్లాండ్ తో టీ20,



వన్డే సిరీస్‌లకు బుమ్రా విశ్రాంతి తీసుకుంటాడని, అతడిని కేవలం ఛాంపియన్స్ ట్రోఫీ ఆడించేలా టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు కథనాలు వచ్చాయి. అయితే దీనికోసం బీసీసీఐ ఓ షరతును పెట్టినట్లు సమాచారం అందింది.

**ఆ షరతు ఏంటంటే**

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఆడే జట్టును జనవరి 12లోగా ప్రకటించాలి. అయితే ఆ తర్వాత కూడా జట్టులో మార్పులు చేసుకునే ఛాన్స్ ఉంటుంది. అందుకే 15 మందితో కూడిన జట్టులో మొదట బుమ్రా పేరు ప్రకటిస్తారట. ఆ తర్వాత టోర్నీ ప్రారంభం (ఫిబ్రవరి 19 నుంచి మొదలు) నాటికి బౌలింగ్ వేసేంత ఫిట్‌నెస్ అతడు సాధిస్తేనే, తుది జట్టులో అవకాశం కల్పిస్తామని మేనేజ్‌మెంట్ ఫిక్స్ అయిందట. కాబట్టి బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం నాటికి ఫిట్ నెస్ సాధిస్తే, మెగాటోర్నీ ఆడే అవకాశం ఉంటుంది.

ఇకపోతే మహ్మద్ షమీ కూడా ఛాంపియన్స్ ట్రోఫీ ఆడుతాడా లేదా స్పష్టత లేదు. అతడు కూడా పూర్తి ఫిట్ నెస్ సాధించాల్సి ఉంది. ఒకవేళ సాధించినా తీసుకుంటారో లేదో క్లారిటీ లేదు. ఏదేమైనా వీరిద్దరూ లేకపోతే మాత్రం భారత బౌలింగ్ దళానికి కాస్త ఇబ్బందనే చెప్పాలి.

**న్యూజిలాండ్ వైద్యుడితో చికిత్స**

వెన్నునొప్పితో బాధపడుతోన్న జస్‌ప్రీత్ బుమ్రా, చికిత్స కోసం న్యూజిలాండ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రోవన్ స్కౌటెన్‌ను సంప్రదించినట్లు తెలిసింది. ప్రస్తుతం బుమ్రా గాయం పరిస్థితిని డాక్టర్ రోవనే పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

# రోహిత్ ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాలి.. ఎలా బయటపడాలో కోహ్లికి తెలుసు

*- మాజీ క్రికెటర్ నవ్ జ్యోత్ సిద్ధూ వ్యాఖ్యా*

ఆస్ట్రేలియా పర్యటనలో విఫలమైన భారత క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి. సీనియర్లుగా ఉన్న వీరిద్దరూ జట్టును ముందుండి నడిపించాలి. కానీ, తడబాటుకు గురై తేలిగ్గా వికెట్లను సమర్పించారు. రోహిత్ కంటే విరాట్ కాస్త నయం అనిపించాడు. కనీసం ఒక్క సెంచరీ అయినా బాదాడు. రోహిత్ మాత్రం కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తీసిన 32 వికెట్ల కంటే కూడా రోహిత్ చేసిన పరుగులే తక్కువని సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో కామెంట్లు వచ్చాయి. అయితే, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సిద్ధూ మాత్రం సీనియర్ ఆటగాళ్లను వెనకేసుకొచ్చాడు. ఒక్కసారి పుంజుకొంటే మాత్రం వారిని ఆపడం ఎవరి తరమూ కాదని వ్యాఖ్యా నించాడు. అయితే, అందుకోసం అదనంగా శ్రమించాలని సూచించాడు.

"విరాట్ కోహ్లి కెరీర్‌లో 80 సెంచరీలు చేశాడు. టెస్టుల్లోనే దాదాపు 10వేలకు పైగా పరుగులు సాధించాడు. అతడికి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇంటికి వెళ్లి.. ఆసీస్ పర్యటనలో ఆడినప్పుడు ఉన్న వీడియోలను చూడాలి. ఎలా బ్యాటింగ్ చేశాననేది తెలుస్తుంది. తప్పు ఎక్కడ జరిగిందనేది అర్థం చేసుకోవాలి. దానికి సమస్య ఏంటనేది తెలుసుకోవాలి. రోహిత్ విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది.

కోహ్లితో పోలిస్తే టెక్నిక్పరంగా రోహిత్ పరిస్థితి దారుణంగానే ఉంది. తొలుత రోహిత్ తన ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాలి. అతడు అద్భుతమైన ప్లేయర్. రోహిత్తో ఐపీఎల్ సమయంలో ఓ 20 నిమిషాలు మాత్రమే మాట్లాడా. స్వచ్ఛమైన బంగారంలాంటి వ్యక్తి. ఇప్పుడు ఆసీస్ పర్యటనలో సరిగ్గా ఆడలేదు. కానీ, టీ20 ప్రపంచ కప్‌లో మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో మూడు సిక్సలు కొట్టిన



విధానం సూపర్. దానిని ఎవరైనా మరిచిపోగలరా? అతడూ మనిషే క్రికెటర్‌కు ఫిట్‌నెస్, ఫామ్ సమస్యలు తప్పవు. అయితే, మునుపటి కంటే ఎక్కువగా సాధన చేస్తే మెరుగు కావడం ఖాయం" .

**ఛాంపియన్స్ ట్రోఫీ బరిలో..**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తుది జట్టులో ఉండటం ఖాయంగానే తెలుస్తోంది. ఇదే చివరి ఐసీసీ ట్రోఫీ అయినా ఆశ్చర్యం లేదని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. టీ20 ప్రపంచ కప్ వచ్చే ఏడాది ఉండగా.. వన్డే ప్రపంచ కప్ 2027లో ఉంది. అప్పటి వరకు ఇద్దరూ ఉండటం కష్టమే.



# స్టేడియాల పునరుద్ధరణ పనులపై ఐసీసీ నిఘా..!

వచ్చే నెలల్ చాంపియన్స్ ట్రోఫీలోని మ్యాచులకు ముందు టీమిండియా దుబాయిలో ప్రాక్టీస్ మ్యాచులు ఆడనున్నది. ప్రస్తుతం ఐసీసీ ప్రాక్టీస్ మ్యాచులకు సంబంధించిన షెడ్యూల్‌తో పాటు నాలుగు వేదికల్లో సదుపాయాల కల్పనపై పని చేస్తున్నది. అదే సమయంలో పాకిస్థాన్‌లో మూడు స్టేడియాల్లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులపై ఐసీసీ నిఘా వేసింది. పలు మీడియా నివేదికల ప్రకారం.. ప్రస్తుతం స్టేడియాల పునర్నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ వరకు పనులు పూర్తయ్యేది అనుమానమేనని పలు నివేదికలు పేర్కొన్నాయి. ఐసీసీ సభ్య బృందం ఇప్పటి వరకు స్టేడియం పునర్నిర్మాణ పనులపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

ఐసీసీ ఈవెంట్ కోసం కరాచీ, లాహోర్, రావల్పిండిలో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 1996 ప్రపంచ కప్ తర్వాత పాక్‌లో కీలకమైన టోర్నమెంట్‌ను నిర్వహిస్తుండడం ఇదే తొలిసారి. అయితే, ఈ టోర్నీ సైతం హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతున్నది. టీమిండియా మ్యాచులు దుబాయి వేదికగా ఆడనున్నది. అయితే, స్టేడియాల పునర్నిర్మాణ పనులపై వస్తున్న వార్తలను పీసీబీ తోసిపుచ్చింది. చాంపియన్స్ ట్రోఫీకి సన్నాహాలు జోరుగానే సాగుతున్నాయని పేర్కొంది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియం, కరాచీలోని నేషనల్ బ్యాంక్ స్టేడియం పునరుద్ధరణ పనులు గడువుకు ముందే పూర్తవుతాయని చెప్పింది. గడాఫీ స్టేడియంలో కొత్త కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారని.. దాంతో సీటింగ్ సామర్థ్యం 35000 వేలకు పెరుగుతుంది, 480 ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పింది.

స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత.. జనవరి చివరి వారంలో స్టేడియం ప్రారంభించనున్నట్లు పేర్కొంది. కరాచీ స్టేడియంలో 350 ఎల్‌ఈడీ లైట్లు.. రెండు భారీ స్క్రీన్స్ ఏర్పాటు చేయడంతో పాటు 5వేలు అదనంగా సీటింగ్ సామర్థ్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రావల్పిండి స్టేడియంలోనూ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి మొదలుకానున్నది. ఇందులో ఎనిమిది జట్లు పాల్గొననుండగా.. రెండు గ్రూపులుగా విభజించారు. లీగ్ దశలో 12 మ్యాచులు ఉంటాయి. ఆ తర్వాత సెమీ ఫైనల్స్, ఫైనల్ ఉంటుంది. భారత్‌లో తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడుతుంది. ఇక దాయాది పాకిస్థాన్‌తో 23న తలపడనున్నది. భారత్ ఫైనల్‌కు చేరుకుంటే.. టైటిల్ మ్యాచ్ సైతం దుబాయిలోనే ఉంటుంది.

# బాక్సింగ్ - ఇక నుంచి 13 కాదు 10 మాత్రమే!

ప్రపంచ బాక్సింగ్ (డబ్ల్యూబీ) మార్గ దర్శకాల మేరకు..కొత్త వెయిట్ కేటగిరీ (బరువులు)లను భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అమల్లోకి తీసుకొచ్చింది. తాజాగా ప్రారంభమైన జాతీయ ఛాంపియన్ షిప్‌లో ఈ కొత్త కేటగిరీలతోనే పోటీలను నిర్వహిస్తోంది.

గతంలో ఉన్న 13 వెయిట్ కేటగిరీలను పదింటికి కుదిస్తూ ప్రపంచ బాక్సింగ్ ఇటీవల నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ప్రారంభమైన జాతీయ పురుషుల టోర్నీలో 10 బరువు విభాగాలతో పోటీలను నిర్వహిస్తున్నారు.

పురుషుల విభాగంలో 50 కేజీలు (ఫ్లై వెయిట్), 55 కేజీలు (బాంటమ్ వెయిట్), 60 కేజీలు (లైట్ వెయిట్), 65 కేజీలు (వెల్టర్ వెయిట్), 70 కేజీలు (లైట్ మిడిల్ వెయిట్), 75 కేజీలు (మిడిల్ వెయిట్), 80 కేజీలు (లైట్ హెవీ వెయిట్), 85 కేజీలు (క్రూజర్ వెయిట్), 90 కేజీలు (హెవీ వెయిట్), ప్లస్ 90 కేజీలు (సూపర్ హెవీ వెయిట్) ఈ కొత్త బరువు విభాగాల్ని నిర్ణయించారు.

మహిళల విభాగంలో 48 కేజీలు, 51 కేజీలు, 54 కేజీలు, 57 కేజీలు, 60 కేజీలు, 65 కేజీలు, 70 కేజీలు, 75 కేజీలు, 80 కేజీలు, ప్లస్ 81 కేజీల విభాగాల్లో పోటీలు ఉంటాయి. కాగా, వీటిలో ఆరు... 55, 60, 65, 70, 80, 90 కేజీల విభాగాలను ఒలింపిక్ కేటగిరీలుగా పేర్కొన్నారు.

ఇకపోతే అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్(ఐబీఏ) గుర్తింపు కోల్పోయిన తర్వాత గత ఎప్రిల్‌లో ప్రపంచ బాక్సింగ్ కొత్తగా మొదలైంది. ఇప్పటికే 60 మంది సభ్యుల మద్దతు కూడగట్టిన ప్రపంచ బాక్సింగ్.. ఐవోసీ గుర్తింపు కోసం ఎదురు చూస్తోంది.




# ఓటీటీకి వచ్చేస్తున్న 'బచ్చలమల్లి'

మన టాలీవుడ్ దగ్గర ఉన్నటువంటి టాలెంటెడ్ హీరోస్‌లో అల్లరి నరేష్ కూడా ఒకరు. కామెడీ సినిమాలు మాత్రమే కాకుండా మంచి కంటెంట్ ఉన్న సినిమాలు కూడా తాను చేస్తుండగా అలా తాను నటించిన లేటెస్ట్ సినిమానే "బచ్చల మల్లి". కొన్ని నిజ జీవిత సంఘటనల ఆధారంగా దర్శకుడు మంగదెవ్వి తెరకెక్కించిన ఈ చిత్రం గత డిసెంబర్‌లో రిలీజ్ అయ్యింది. అయితే నటుడుగా అల్లరి నరేష్ మరోసారి అలరించగా సినిమా అనుకున్న రేంజ్‌లో సక్సెస్ కాలేకపోయింది.


ఇక ఈ సినిమా ఓటిటి రిలీజ్‌కి అయితే ఇపుడు రెడీ అయ్యింది. ఈ సినిమా ఓటిటి హక్కులు మొత్తం మూడు సంస్థలు తీసుకోగా అమెజాన్ ప్రైమ్ వీడియో, సన్ నెక్స్ట్ అలాగే ఈటీవీ విన్ సొంతం చేసుకోగా లేటెస్ట్‌గా ఈటీవీ విన్ డేట్‌ని ఇచ్చేసారు. జనవరి 10 నుంచే




చిత్రం స్ట్రీమింగ్‌కి వస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. సో, థియేటర్‌లో మిస్ అయ్యినవారు ఈటీవీ విన్‌లో సినిమా చూడొచ్చు. ఇక ఈ చిత్రంలో అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటించగా విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు.

## హనుమాన్‌ను మరిపిస్తారా!?

మన టాలీవుడ్ సినిమా దగ్గర సంక్రాంతి పండుగ సినిమాలపరంగా ఎప్పుడూ మంచి రసవత్తరంగానే ఉంటుంది. అలా గత ఏడాది సంక్రాంతికి వచ్చిన సినిమాలు బాక్సాఫీస్‌ని షేక్ చెయ్యగా ఈసారి సంక్రాంతికీ సాలిడ్ సినిమాలు రిలీజ్‌కి సిద్ధమయ్యాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్, బాలయ్య భారీ సినిమా డాకు మహారాజ్, వెంకీ మామ నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలున్నాయి. అయితే ఇప్పటివరకు మన టాలీవుడ్ దగ్గర సంక్రాంతి బరిలో వచ్చిన సినిమాల్లో ఆల్ టైం రికార్డు వసూళ్ళని చిన్న సినిమాగా వచ్చినప్పటికీ గత ఏడాది "హనుమాన్" అందుకుంది. యంగ్ హీరో తేజ సజ్జ, అలాగే ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వచ్చిన ఈ సినిమా టాలీవుడ్‌లో హిస్టరీ క్రియేట్ చేసింది. దీనితో హనుమాన్ సెట్ చేసిన రికార్డు ఇపుడు బ్రేక్ అవుతుందో లేదో చూడాలి. ఇప్పుడు వరకు వచ్చిన సంక్రాంతి సినిమాల్లో హనుమాన్ ఒకటే 300 కోట్లకు పైగా గ్రాస్‌ని దాటి వసూలు చేసింది. అలాగే షేర్ పరంగానూ సంక్రాంతి బరిలో హను మాన్‌దే పైచేయి. మరి ఈసారి వస్తున్న సినిమాలు ఈ రికార్డుని బ్రేక్ చేస్తాయో లేదో చూడాలి.



# శంకర్.. కంబ్యాక్ అవుతారా?



ఇండియన్ సినిమా దగ్గర దర్శకుల్లో "ఓజీ" శంకర్ కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తన కెరీర్ స్టార్టింగ్‌లోనే తన విజన్ ఏంటో అందరికీ చూపించి అప్పట్లోనే పాన్ ఇండియా లెవెల్లో ముద్ర వేసుకున్నారు. అయితే ఇపుడు శంకర్‌నుంచి తన రేంజ్ హిట్ పడి చాలా కాలమైంది. ఇటీవల వచ్చిన "భారతీయుడు 2" దారుణంగా విఫలమైంది. దీనితో ఒక అన్ని ఆశలు ఇపుడు వస్తున్న గేమ్ ఛేంజర్ మీదనే ఉన్నాయి. అయితే గేమ్ ఛేంజర్‌తో వాళ్ళు వీళ్ళు కాదు శంకర్ కంబ్యాక్ కొట్టి మళ్లీ ఫామ్‌లోకి వస్తే తన స్టామినా ఏంటో చూడాలని చాలామంది ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అప్పట్లోనే తన స్టైలిష్ టేకింగ్, విజువల్స్, గ్రాండియర్‌తోనే ఆశ్చర్యపరిచారు. అయితే ఇపుడు కొంచెం స్లో అయినా.. శంకర్ ఇమేజ్ మాత్రం అలానే ఉంది. అందుకే తమిళ ఆడియెన్స్ సహా తెలుగులో కూడా చాలా మంది శంకర్ మాస్ కంబ్యాక్ ఇస్తే చూడాలని ఎమోషనల్‌గా ఎదురు చూస్తున్నారు. మరి గేమ్ ఛేంజర్ విషయంలో ఏమవుతుందో చూడాలి.

# సోషల్ మీడియాలో 'డ్యూడ్' వైరల్



యంగ్ అండ్ టాలెంటెడ్ తేజ్ నటిస్తూ కన్నడ-తెలుగు భాషల్లో దర్శకత్వం వహిస్తున్న వినూత్న ద్విభాషా చిత్రం "డ్యూడ్". ఫుట్ బాల్ నేపథ్యంలో బలమైన భావోద్వేగాలతో సాగే చిత్రాన్ని ఫుట్‌బాల్ ప్రేమికుడైన స్వర్గీయ కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్‌కు అంకితం చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి విడుదలైన "ఏమిటో మాయ మంత్రమే.. మది జింకలా పరిగెత్తేనే" పాట అటు కన్నడలో.. ఇటు తెలుగులో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

తెలుగులో ఎసిపి మనోహర్ రాసిన గీతాన్ని అభిషేక్ ఆలపించారు. ఎమిల్ మహమ్మద్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. రంగాయన రఘు ఫుట్‌బాల్ కోచ్‌గా ముఖ్యపాత్ర పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ 50శాతం పూర్తయింది. సమాంతరంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న చిత్రాన్ని జూన్ లేదా జులైలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు, కన్నడ, భాషల్లో ఏక కాలంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. పనోరమిక్ స్టూడియోస్ పతాకంపై ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి "జింకే మారి" ఫేమ్ ఎమిల్ మహమ్మద్ సంగీతం సమకూర్చుతుండగా, "అలా మొదలైంది" ఫేమ్ ప్రేమ్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు.



# డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు

నందమూరి బాలకృష్ణ హీరోగా ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కించిన మాస్ ఎంటర్టైనర్ "డాకు మహారాజ్". మరి బాలయ్య అభిమానులు సహా మాస్ ఆడియెన్స్ ఓ రేంజ్‌లో సినిమా కోసం ఎదురు చూస్తుండగా.. ఈ సంక్రాంతి కానుకగా సినిమా రిలీజ్‌కి వస్తోంది. అయితే ఈ చిత్రం అవైటెడ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్ గురువారం అనంతపురంలో ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. కానీ సాయంత్రం జరగాల్సిన ఈవెంట్‌ని రద్దు చేసినట్టుగా కన్ఫర్మ్ చేశారు. తిరుమల సన్నిధిలో చోటుచేసుకున్న తీవ్ర విషాదం కారణంగా తమ వేడుకలు జరపడం లేదని కన్ఫర్మ్ చేశారు. ఆ దుర్ఘటనపట్ల తమ టీం అంతా చింతిస్తున్నామని అందుకే ఈవెంట్‌ని నిలిపివేశామని అందరూ అర్థం చేసుకుంటారని అనుకుంటున్నామని చిత్ర బృందం ప్రకటించింది.